
# మిసిమి

మాస పత్రిక

డిశంబర్-2004



రూ. 8/-



తన చిట్ట చివరి పెయింటింగ్‌తో డాలీ (1983)

# మిసిమి

"All that we are is the product of what we have thought"
is "We are what we think." - Dammapada.


సంపుటి 15 | డిశంబర్ 2004 | సంచిక 12

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


క్రిస్టియన్ మత్తయ్యాస్ థియొడోర్ మొమ్సెన్ — మూలం : సి.డి. ఆఫ్ విర్సెన్, అనువాదం: బి.వి. రామిరెడ్డి

స్వాపి - ప్రేమికుడు - పిచ్చివాడు - సాల్వడార్ డాలీ — - కాండ్రేగుల నాగేశ్వరరావు

జిడ్డు కృష్ణమూర్తి 'బోధనలు - దర్శనం' — - షణ్ముఖానంద

ఇల్లు — - వింజనంపాటి రాఘవరావు

బింబ ప్రతిబింబాలు,
సామాజిక అస్తవ్యస్తత - విలోమ కథలు — - ముంగర జాషువ

మంచితనాన్ని మించిన మనిషి — - 'శ్రీ విరించి'



విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **శిలువ వేయబడ్డ క్రీస్తు-మెడోనా** (మోడల్ గాలా) 1954

చిత్రకారుడు : **సాల్వడార్ డాలీ**

Printed & Published by **Bapanna Alapati** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# సంపాదకుని మాట

1997 జనవరి నుంచి ప్రారంభమై, డిశంబరు 2004 వరకు నిరంతరాయంగా నెలా నెల ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీతల స్వీకారోపన్యాసాలను మిసిమి పాఠకులకు అందించాం. ఈ ఉపన్యాసాలలో అధిక భాగం తెలుగు చేసిన బి.వి. రామిరెడ్డి, ఆంగ్లశాఖ, సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, విజయవాడగారికి, 12 ఉపన్యాసాలు అనువదించిన విజయనగరం మహారాజా కళాశాలలో తెలుగు శాఖకు చెందిన (ఇప్పుడు రిటైర్డ్) డా. యు.ఎ. నరసింహమూర్తి గారికి మిసిమి పాఠకుల తరపున, హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. డా. నరసింహమూర్తి మిసిమిలో తాను అనువదించిన నోబెల్ సాహితీ ఉపన్యాసాలను ''నోబెల్ సాహిత్య పురస్కారోపన్యాసాలు'' పేరుతో ఒక గ్రంథంగా ప్రచురించారుగూడ. వీరిద్దరేగాక మో, బి. తిరుపతిరావు, సుమనస్పతిరెడ్డి, సి.యల్.యల్. జయప్రద లాంటి హేమా హేమీలు గూడ ఈ అనువాద ప్రక్రియలో పాల్గొన్నారు.

ఈ విధంగా ప్రపంచ సాహిత్యంలోనే అత్యున్నత శిఖరాలను పాఠకులకు దర్శింపజేసిన ఖ్యాతి మిసిమి ఆర్జించింది. ఈ విషయంగా అనేక మంది పాఠకులు, వివిధ దేశాల సంస్కృతుల నేపథ్యంలో వెలువడిన సాహితీ సౌరభాల గుబాళింపు కైమోడ్చి, తమ విరిసిన పెదవితో, చెమరిన కళ్ళతో ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ విధంగా ఇన్ని సంవత్సరాలు ఒకే శీర్షికను - నోబెల్ సాహితీ పురస్కార స్వీకారోపన్యాసాలు - నిర్వహించగలిగి నందుకు మిసిమి వినమ్రమయి, పాఠకులు చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నది. ఏ పత్రిక తీసుకోని చొరవను మిసిమి ప్రదర్శించినందుకు అభిమాన పాఠకులు హర్షం ప్రకటిస్తున్నారు.

ఈ నోబెల్ సాహితీ పురస్కార స్వీకారోపన్యాసాల శీర్షికను ఈ నెలతో ముగిస్తున్నాము. ఇప్పటి వరకు తెలుగులోరాని నోబెల్ సాహితీ ఉపన్యాసాలను తెలుగు చేయించి, మధ్యమధ్య ప్రచురించగలమని పాఠకులకు తెలియజేస్తున్నాము.

నోబెల్ సాహితీ ఉపన్యాసాలు ప్రపంచ సాహితీ లోకంలో ఎంతగొప్పవో, భారతీయ భాషలలో అంతే గొప్పవైన 'జ్ఞాన్ పీఠ్' బహుమతి స్వీకారోపన్యాసాలను తెనిగించి 2005 జనవరి నుంచి వరుసగా మిసిమి పాఠకులకు అందించగలమని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. ఈ ఉపన్యాసాలు గూడ సాహితీ విలువల్లో నోబెల్ సాహితీ ఉపన్యాసాలకు ఏమాత్రం తీసిపోవు. వీటిని ప్రొ॥కె. లక్ష్మీరెడ్డి, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ అనువదించడానికి అంగీకరించారని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

ఎప్పటిలాగే మిసిమిలో వచ్చే 'జ్ఞాన్ పీఠ్' అవార్డు ఉపన్యాసాలను మా పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాము. పాఠకుల నుంచి వారి విలువైన సూచనలను మిసిమి ఆశిస్తోంది.

# క్రిస్టియన్ మత్తయ్యాస్ థియొడోర్ మొమ్మ్సెన్

## (1902వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారోపన్యాసము)

మూలం: సి.డి. ఆఫ్‌విర్సెన్ (శాశ్వత కార్యదర్శి, స్వీడిష్ అకాడెమి)

అనువాదం : బి.వి. రామిరెడ్డి

నోబెల్ వీలునామాలోని రెండవపేరా సాహిత్యంలో ఉత్తరాలనేగాక సాహిత్య విలువలున్న రచనలన్నింటిని సాహిత్యంగానే పరిగణించాలని పేర్కొంటున్నది. తదనుగుణంగానే నోబెల్ పురస్కారాల్ని తాత్త్వికులకు, మతపరమైన రచనలు చేసినవారికి, శాస్త్రవేత్తలకు, చరిత్రకారులకు వారి కళాత్మక విలువలననుసరించి ప్రదానం చేయబడుతున్నది.

ఈ సంవత్సరం స్వీడిష్ అకాడెమి చాలమంది అత్యుత్తమ రచయితల నుండి, చరిత్రకారుడైన థియొడోర్ మొమ్మ్సెన్‌కు నోబెల్ పురస్కారాన్ని ప్రదానం చేయాలని నిర్ణయించింది. ఆయన పేరును రాయల్ ప్రష్యన్ అకాడెమి ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌కు చెందిన పద్దెనిమిదిమంది సభ్యులు ప్రతిపాదించారు.

ఆయన డెబ్బయ్యవ జన్మదిన సందర్భంగా జంగెమెయిస్టర్ ప్రచురించిన రచనల పట్టికలో 920 రచనలు చోటు చేసుకున్నాయి. ఆయన అతి ముఖ్యమైన ప్రాజెక్టులలో ముఖ్యమైనదైన ''కార్పస్ ఇన్‌స్క్రిప్షనమ్ లాటినమ్'' అత్యంత కష్టతరమైనది. ఇది 15 భాగాల సమాహారం. మహామేధావి అయిన మొమ్మ్సెన్ రోమన్ చరిత్ర, నాణేలచరిత్ర, రోమన్ చరిత్ర పరిణామం, రోమన్‌లా, మేధా ప్రవచనాలపై విశేషకృషి చేశాడు. ''హిస్టరీ ఆఫ్ రోమ్'' రచయితగా ఆయన సుప్రసిద్ధుడు. అందుకుగాను స్వీడిష్ అకాడెమి ఆయనకు నోబెల్ సాహితీ పురస్కార ప్రదానం చేయాలని నిర్ణయించింది.

ఈ రచన 1854 నుండి వెలుగు చూడడం ప్రారంభించింది. ఈ క్రమంలోని నాలుగవ భాగం ఇంకా ప్రచురింపబడలేదు. 1885లో ప్రచురింపబడ్డ అయిదవ భాగం అద్భుతరచన. ఇది ఎన్నో భాషలలోనికి అనువదింపబడింది. ఇందులో రచయిత బలమైనశైలి, పాండిత్యం, విశ్లేషణా శక్తి, కళాత్మకత వ్యక్తమయ్యాయి. భావపూరిత ఊహాత్మకత, జ్ఞానం ఈ రచనకు వన్నెతెచ్చాయి. అవి రచయితలోని కవిని, చరిత్ర కారుణ్ణి అనుసంధించాయి. ఈ రచనలోని అయిదవ భాగం భావాత్మకత కవిత్వానికి, చరిత్ర రచనకు తల్లివంటిదని రుజువు చేస్తుంది. ఈ విషయంలో అతణ్ణి మెకాలేతో పోల్చవచ్చు.

రాజ్యానికి రోమన్ ప్రజలు చూపించే నమ్రత కొడుకు తండ్రికి చూపించే నమ్రత లాంటిది. రోమ్ చరిత్రను ప్రారంభ దశనుండి అత్యుత్తమ స్థాయి వరకు అద్భుతంగా వివరించాడు. రోమన్ సామ్రాజ్యం

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

సువిశాలమైన కొద్దీ అది ఎదుర్కొన్న సమస్యల్ని, సెనేట్ సగౌరవంగా ప్రభుత్వపు పనులను జాగ్రత్తగా నెరవేర్చిన విధానాలను, పాత విధానాలు కొత్త సమస్యలను తీర్చలేక పోవడాన్ని, దేశాభిమానంలేని పెట్టుబడిదారీ విధానం, అధికార దుర్వినియోగానికి పాల్పడడం, తరచుగావచ్చే సుదీర్ఘమైన యుద్ధాలు, మిలటరీలో అత్యున్నతాధికారులు స్వతంత్రులవడం, అలాంటి పరిస్థితుల్లో సీజర్‌లాంటి చక్రవర్తియొక్క అవసరం, మొదలైనవాటిని మొమ్సెన్ చక్కగా వివరించాడు. చరిత్రకారుడిగా అనవసరమైన డాంభిక ప్రదర్శనను మొమ్సెన్ పరిహరించాడు.

అనేకమంది విమర్శకులు మొమ్సెన్ అప్పుడప్పుడు, ఒకమేధావిగా, తన అభిప్రాయాలలో కొట్టుకు పోయాడని చెబుతూ, సీజర్ ప్రత్యర్థులను గురించి ఆయన వ్యాఖ్యలు అందుకు నిదర్శనంగా చూపుతుంటారు. అయితే ఆయన మూర్ఖమైన అధికారాన్ని ఎప్పుడూ పొగడలేదు. అత్యుత్తమమైన అధికారం ఎప్పుడూ రాజ్యపు అత్యున్నతమైన ఆదర్శాలను కాపాడాలన్నాడు. మొమ్సెన్ తరచుగా ప్రాచీన పరిస్థితులను ఆధునిక రీతులకు అనుసంధించి వివరిస్తాడని విమర్శించారు. అయితే ఈ విధానం ప్రాచీన చారిత్రక సంఘటనలకు, ఆధునిక సంఘటనలకు మధ్య కాలాంతరంలో కనుపించిన సమాన లక్షణాలు, మొమ్సెన్ భావుకత సృజించినవికావు. ఆయన రచనకు ఈ విధానం కొత్తమెరుగునిచ్చింది. ఆయన చారిత్రక వినిమయవాదికాడు. ఆయన పోలీబియస్‌ను అభిమానిస్తాడు, కాని అతడు మనిషి యొక్క నీతిశక్తిని గుర్తించకపోవడాన్ని విమర్శిస్తాడు. అలాగే విప్లవవాది అయిన సి. గ్రాక్కస్‌ను ఒక్కోసారి పొగుడుతాడు, ఒక్కోసారి విమర్శిస్తాడు. పాలకులకు, పాలితులకు ఇద్దరికీ సమానమైన నీతి లేకపోతే అలాంటి వ్యవస్థ ఇసుక పునాదులమీద నిర్మించిన కట్టడంలాగ కుప్పకూలిపోతుందంటాడు. ఆరోగ్యకరమైన గృహస్థజీవనం దేశ పునాదికి మూలం అంటాడు.

మేధావి, ఉత్సాహవంతుడు, వ్యంగ్యకారుడు, రచయిత అయిన మొమ్సెన్ రోమ్‌యొక్క ఆంతరిక, వైదేశిక విషయాలమీద; మతం, సాహిత్యం, న్యాయశాస్త్రం, ఆర్థికశాస్త్రం, ఆచార వ్యవహారాలను గురించిన విషయాలను చక్కగా ప్రపంచానికి అర్థమయ్యేట్టు చేశాడు. అతని వివరణాత్మక వర్ణనలు అద్భుతమైనవి. ఆయన వర్ణించిన లేక్‌ట్రసిమెని, కన్నె, అలెరియ, ఫారసలస్ యుద్ధాలను ఎవరూ మర్చిపోలేరు. అతని పాత్రచిత్రణ సజీవమైనది. అతని సిగ్రాక్కస్, మారియస్, సుల్లాన్ పాత్రలు ఇందుకు ఉదాహరణలు. వీటితోబాటు, ఆయనకు అత్యంత ప్రీతి పాత్రమైన జూలియస్ సీజర్, హన్నిబల్, సిపియొ, ఆఫ్రికానస్ అత్యంత హృద్యమమైనవి. ముఖ్యంగా సీజర్, హన్నిబల్ పాత్రలు యువకులను, యువ సైనికులను ఉత్తేజితుల్ని చేస్తాయి.

మొమ్సెన్‌లో విచిత్ర లక్షణాల కలయిక కనిపిస్తుంది. అతడు మహా మేధావి, విశ్లేషకుడు, అయినప్పటికి తన నిర్ణయాల విషయంలో తీక్షణంగా వుంటాడు. ప్రభుత్వ కార్యకలాపాలను, సంక్లిష్టమైన ఆర్థిక వ్యవస్థను గొప్ప విజ్ఞతతో వివరిస్తాడు. అతడు ప్రధానంగా కళాకారుడు. అతని ''హిస్టరీ ఆఫ్

రోమ్'' గొప్ప కళాఖండం. తన రచన మొదటి భాగాన్ని ప్రచురణకు యిస్తూ ఈ రచన కోసం గొప్ప శ్రమ తీసుకొన్నానని చెప్పాడు. అతను డ్యాక్టరేట్ తీసుకున్న తరువాత అయిదువ వార్షికోత్సవం సందర్భంగా, జ్ఞాన సముద్రాన్నిగురించి అద్భుతంగా మాట్లాడాడు. కేంబ్రిడ్జ్‌లో ప్రారంభోపన్యాసం చేస్తూ లార్డ్ ఆక్టన్, మొమ్మ్సెన్‌ను ఆధునిక అత్యున్నతస్థాయి రచయితలలో ఒకడిగా పేర్కొన్నాడు; మొమ్మ్సెన్ గొప్ప సాహితీ పురస్కారానికి అర్హుడని అభిప్రాయపడ్డాడు. ''హిస్టరీ ఆఫ్ రోమ్'' జర్మన్ ప్రతి ఈ మధ్యనే ప్రచురింపబడింది. అది ఒక చారిత్రక శకలం. అందులో కవి, పండితులిద్దరి ప్రతిభ కనుపిస్తుంది. మొమ్మ్సెన్ యౌవనం (1883)లో, ''సాంగ్ బుక్ ఆఫ్ త్రీ ఫ్రెండ్స్'' అనే కవితా సంకలనం రచించాడు. ఇటాలియన్ కవులు - కార్డుచ్చి, జియోకొసా, ఆయనకు అభిమాన పాత్రులు.

కళ, శాస్త్రం వాటి స్రష్టలను మానసికంగా యువకులుగానే ఉంచుతాయి. 85 ఏళ్ళ వయసులోను మొమ్మ్సెన్ తన రచనలలో యువకుడు. 1895లో, తన వృద్ధాప్యంలోను ''ప్రష్యన్ అకాడెమి ఆఫ్ సైన్స్'' కార్యకలాపాలకు ఎంతో చేయూత నిచ్చాడు. ఆయన వృద్ధుడైనా ఆయనలో యువకులలో ఉండే తీవ్రత ఇంకావుంది. కళాత్మకమైన ఆయన చరిత్ర రచన శక్తివంతమైంది.

**జీవిత చరిత్ర**

థియొడోర్ మొమ్మ్సెన్ (1817-1903) పంథొమ్మిదవ శతాబ్దపు అత్యుత్తమ స్థాయి ప్రాచీన చరిత్రకారుడు. ఆయన గార్డింగ్‌లో జన్మించాడు. తండ్రి ఒక పాస్టర్. 1838 - 43 సంవత్సరాల మధ్య కియోల్‌లో న్యాయ శాస్త్రం, ప్రాచీన సాహిత్యం చదివాడు. తరువాత కొద్దికాలం ఫ్రాన్సు, జర్మనీలలో జర్నలిస్టుగా పనిచేశాడు. తరువాత లీప్‌జిగ్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రాచార్యుడయ్యాడు. 1848-49 విప్లవంతో ఉన్న సంబంధాలవల్ల 1850లో ఆ పదవిని పోగొట్టుకున్నాడు. జ్యూరిచ్, బ్రెస్లౌ విశ్వవిద్యాలయాల్లో కొంతకాలం పనిచేశాక 1858లో బెర్లిన్ విశ్వవిద్యాలయంలో ప్రాచీన చరిత్ర శాఖాచార్యుడయ్యాడు. ఆయన ''ప్రష్యన్ అకాడెమి ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్''కు శాశ్వత కార్యదర్శి. 1870లో ప్రష్యన్ పార్లమెంటు సభ్యుడు.

మొమ్మ్సెన్ చాలా రచనలు చేశాడు. 1887 వరకు ఆయన రచన పట్టిక 900 రచనలను పేర్కొన్నది. ఆయన రోమన్ చరిత్రాధ్యయనాన్ని విప్లవీకరించాడు. 1867 -1959ల మధ్య బెర్లిన్ అకాడెమి ప్రచురించిన రోమన్ శాసనాల సంకలనానికి అతడే ప్రధాన సంకలనకర్త; పరిష్కర్త. ఈ సంకలనం వల్లనే రోమన్ ప్రభుత్వం, పరిపాలన, ఆర్థికశాస్త్రం, పెట్టుబడి మొదలైన వాటిని శాస్త్రీయంగా పఠించే అవకాశం యేర్పడింది. ఆయన రోమన్ నాణాలు, రాజ్యాంగం, క్రిమినల్ లాలమీద రచించిన పుస్తకాలు సర్వకాలీనమైనవి. ఆయన శక్తివంతమైన రచయిత. 1848-49 విప్లవం అతని దృక్కోణం మీద ప్రభావాన్ని చూపింది. ఆయన ''హిస్టరీ ఆఫ్ రోమ్'' అత్యుత్తమ శ్రేణి రచన. జూలియస్ సీజర్ అంటే, అతని స్టేట్స్‌మన్‌షిప్ అంటే ఆయనకు విపరీతాభిమానం. ఆయన రోమన్ సామ్రాజ్య చరిత్ర వ్రాయాలనుకున్నాడు, కాని, వ్రాయలేకపోయాడు.

# స్వాప్నికుడు - ప్రేమికుడు - పిచ్చివాడు - సాల్వడార్ డాలీ

- కాంౖడేగుల నాగేశ్వరరావు

**స్వాప్నికునిగా:**

''సాల్వడార్ డాలీ'' ఆ పేరు వింటూనే మన మనస్సులో ఉవ్వెత్తుగా లేచి పడుతుంది ఒక మధుర స్వప్నం. 20వ శతాబ్దంలో పికాసోతో సమానంగా ఖ్యాతి నార్జించిన స్వాప్నికుడు. ఆ శతాబ్దపు ఆరంభంలో (1904)లో జన్మించి అదే శతాబ్దంలో (1987) తనువు చాలించిన చిరంజీవి. గత శతాబ్దపు ఆలోచనా సరళికి, జీవన రీతికి, కళాజీవులు సాకారం చేసుకున్న కమ్మని కలలకు నిలువెత్తు ఉదాహరణ. ఒక చెరగని సంతకం డాలీ.

డాలీ తల్లిదండ్రులు స్పెయిన్‌లోని ఫిగరస్ (Figueras) ప్రాంతంవారు. ఇది కాటలోనియా అనబడే స్వతంత్ర రాష్ట్రం. గత శతాబ్దపు చిత్రకళను ప్రభావితం చేసి, ఆధునిక చిత్రకళకు మూల విరాట్టులైన పికాసో, మైరో, డాలీ ఈ ముగ్గురూ ఆ ప్రాంతం వారే కావటం విచిత్రం, విశేషం. ఇందులో ఒకరు క్యూబిజానికి (ఘనవాదానికి), ఒకరు అవ్యక్తతతో కూడిన సర్రియలిజానికి (ఇది సిద్ధాంత పరమయినది), మరొకరు అధివాస్తవికత (Surrealism)కు ప్రతీకలు.

డాలీ తల్లిదండ్రులకు డాలీకి ముందే ఒక మగ బిడ్డ పుట్టి చనిపోయాడు. ఆ బిడ్డ పేరే సాల్వడార్ డాలీకి పెట్టారు. తన పేరు గురించి చెబుతూ డాలీ తాను చిత్రకళా ప్రపంచాన్ని డాడాయిజం నుండి, సిద్ధాంత పరమైన సర్రియలిజం నుండి, అవ్యక్త చిత్రకళ నుండి రక్షించడానికే పుట్టానని చెప్పుకున్నాడు. (Salvador అంటే Spain భాషలో రక్షకుడని అర్థం). చిన్న తనంలో తిండిపట్ల ఎక్కువ మక్కువ చూపి, తాను పెద్దయిన తరువాత వంటవాడు కావాలని కోరుకున్నాడు. చిన్నతనం గడచి 11 సంవత్సరాల వయస్సు నాటికి నెపోలియన్‌లా కావాలని ఆకాంక్షించాడు. 18 సంవత్సరాల యవ్వన దశలో తాను సాల్వడార్ డాలీ గానే వుండి పోయి తన సత్తా ప్రజలకు తెలపాలను కున్నాడు. 18 సంవత్సరాల వరకూ తన స్వగ్రామం అయిన ఫిగరస్‌లో గడిపాడు. తాను పుట్టిన ఆ ప్రదేశమంటే డాలీకి విపరీతమైన ప్రేమాభిమానాలు. 'జననీ జన్మభూమిశ్చ' అన్నట్లు అంత అందమైన ప్రదేశం ఈ సృష్టిలోనే లేదనేది అతని దృఢాభిప్రాయం. పెద్దయి పేరు తెచ్చుకున్న తరువాత అక్కడే తనదైన ప్రత్యేక రీతిలో ఆధునిక తను ప్రతిబింబించేదిగా ఒక మ్యూజియంను నెలకొల్పి తన చిత్రాలనందులో వుంచాడు. చనిపోయిన తరువాత అతని కోరిక మేర ఆ మ్యూజియం మధ్యలో సమాధి గావించ బడ్డాడు.

అందరు ప్రఖ్యాత పురుషులలానే డాలీ కూడా బాల మేధావిగా పేరు గాంచాడు. కానీ స్కూలు, కాలేజీ జీవితంలో ఎప్పుడూ 'రాముడు మంచి బాలుడు' అన్న రీతిలో వ్యవహరించలేదు. తన అధ్యాపకులతో జగడాలు, వాళ్ళను మూర్ఖులని అందరి ముందే యాగీ చేయడం, 'ఎడ్డం' అంటే 'తెడ్డం' అనటం అతనికి అలవాటు. స్కూలు జీవితంలో ప్రతిభావంతునిగా పేరు గాంచినా పరీక్షలకు హాజరు కాకపోవటం, అకాడమీ నుంచి సస్పెండు కావటం లాంటివి నిత్యకృత్యాలు. ఈ విపరీత ధోరణి చిన్న తనం నుండీ చివరివరకూ వుంది. ఆరవ యేట కుంచె చేత బట్టి అప్పుడు ప్రచారంలో

---

కాంౖడేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

ఉన్న ఇంప్రెషనిజం (ముద్రావాదం) శైలిలో ఎన్నో చిత్రాలు వేశాడు. కుమారుని ప్రతిభను తీర్చి దిద్దాలనుకొని తండ్రి ఒక ప్రత్యేక డ్రాయింగ్ టీచర్‌ను నియమిస్తే నిర్ద్వందంగా తిప్పికొట్టాడు. తాను ఇంప్రషనిష్టునని, ఒక వస్తువు యొక్క స్వభావాన్ని బాహ్యపరంగా కాక తనలో ఉద్భవించిన భావాల పరంగా అంటే అది తనమీద వేసిన ముద్రల పరంగా చిత్రించదలచటము చేత, ఉపాధ్యాయుని వల్ల తనలోని వ్యక్తిత్వం, మూర్తిమత్వం దెబ్బతింటాయని భావించాడు. 1918వ సంవత్సరములో మొదటిసారిగా తన కళాకృతులను ప్రదర్శనకు పెట్టడమే కాకుండా స్టూడియం (Studium) అనే మాస పత్రికలో చిత్రకళకు సంబంధించిన వ్యాసాలు వ్రాసాడు. ఆనాడు వ్రాసిన వ్యాసాలలో ప్రముఖ చిత్ర కారులైన మైఖల్ ఆంజలో, డావించీ, గోయా, ఎల్‌గ్రేకో, డ్యూరల్‌లపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు. వెర్మీర్, ఇంగ్రెస్, టేషియన్, రింబ్రాండ్ లాంటి చిత్రకారులతో తనను పోల్చుకొని తాను చాలా అల్పుడననే భావానికి లోనయ్యేవాడు. డాలీ దృష్టిలో ఇటాలియన్ చిత్రకారుడైన రాఫెల్ సాక్షాత్తు చిత్రకళను ఉద్ధరించడానికి జన్మించిన ఒక దేవత. రాఫెల్‌తో తనకు లేని పోలిక తెచ్చుకొని రాఫెల్‌లా మెడ ఒకవైపుకు వంచి విచారవదనంతో తిరుగుతూ ఉండేవాడు. 1919లో అతను వేసిన చిత్రమొకటి మొదటిసారిగా అమ్ముడు పోయింది. దానితో మనస్సులో ఆత్మ విశ్వాసాన్ని నింపుకున్నాడు. అప్పటి నుంచీ తన్ను తాను ఒక మేధావిగా భావించుకునేవాడు.

1919లో స్పెయిన్‌లోని మేడ్రిడ్ చేరుకున్నాడు. అక్కడ లలిత కళాశాలలో చిత్రకళనభ్యసిస్తున్న రోజులలో ఆధునిక వైతాళికుల భావాలు కల అవంత్‌గ్రేడ్ (Avantiguard) చిత్రకారులతో శ్రుతి కలిపాడు. అక్కడే భవిష్యత్‌లో అతనితో కలసి సినిమాలు తీసిన బూనేల్ (Bunuel), కవి గార్షియా లోకాతో గాఢమైన అనుబంధం ఏర్పడింది. ఆ కాలేజీలో చదువుతున్నంత సేపు అక్కడ వున్న అధ్యాపకుడైన డంయాన్ న్యూయజ్‌తో నిత్యం తగాదా వేసుకొని అతను ఒకటి చెబితే తాను మరొకటి చేసేవాడు. ఈ వైయక్తిక సంఘర్షణ నుంచే తనలోని సృజన పుష్పించి మొగ్గ తొడిగిందని తన ఆత్మకథలో వ్రాసుకున్నాడు. 1921 ప్రాంతంలో వేసిన చిత్రాలన్నీ దాదాపు ప్రకృతి దృశ్యాలు, లేదా చిత్తరువులు. 1922 నుంచి చిత్రకళలో తన గమ్యాన్ని తాను వెతుక్కుంటూ సుమారు 7 సంవత్సరాలు ప్రయాణం సాగించాడు. అత్యంత కీలకమైన ఈ సంద్దిగ్ధ దశలో అనేక ప్రయోగాలు గావించాడు. ఇంప్రషనిజానికి భిన్నంగా పాయింటలిజమ్ (Pointalism) (చిత్రాలలో రేఖలకు బదులుగా రంగుల బిందువులను ఒక దాని ప్రక్కన మరొకటి చేరుస్తూ, రేఖల అవసరం లేకుండా చేయటం) లో కొన్ని చిత్రాలు వేశాడు. దాని తరువాత ఫావిజమ్‌ను (పాల్‌గాగున్ చిత్రాలు ఈ శైలికి ప్రతీకగా నిలుస్తాయి. ఉదాహరణకు ఆకాశాన్ని ఆకుపచ్చగా చిత్రించటం లాంటివి) ఆశ్రయించాడు. తరువాత కొంత కాలం ఘనవాదశైలి (Cubism) లో చిత్రాలు గీశాడు. చివరకు 1928 నాటికి తన్నుతాను ఆత్మ సాక్షాత్కారము చేసుకొన్నట్లుగా 'అధివాస్తవికత' (Surrealism) ధోరణిలో తనదైన ముద్రను నిలుపుకుంటూ చివరి వరకూ ప్రయాణం కొనసాగించాడు. ఈ అధివాస్తవికత చిత్రీకరణకు ప్రోత్సాహమిచ్చి, ఆవైపు డాలీని మళ్ళించినవాడు అతని ప్రగాఢ మిత్రుడైన కవి పాల్ ఆంద్రే బ్రిటన్ (Paul Andrae Breton).

డాలీ అధివాస్తవికత శైలి చిత్రాలకు కేంద్ర బిందువు ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్తయిన సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతం. ఆధునిక ఆలోచన రీతిని మహోత్కృష్టమైన మలుపు తిప్పిన అతని పుస్తకం 'కలలపై విశ్లేషణ'. ఇది డాలీకి నిత్య పారాయణ గ్రంథం. మానవుడు సుషుప్త అవస్థలో ఉన్నపుడు జరిగే విలువల మధ్య విభేదాలే కలలు అన్న ఫ్రాయిడ్ సిద్ధాంతానికి దృశ్యరూపం ఇచ్చినవాడు, ఇవ్వగలిగిన

వాడు కూడా డాలీయే. ఈ అనితర సాధ్యమైన కార్యాన్ని ప్రపంచం నిబిడాశ్చర్యంతో విస్తుపోయేలా, చిత్రీకరణ జరిపి తనకేగాక ఫ్రాయిడ్ సిద్ధాంతానికే పేరు వచ్చేలా చేశాడు. డాలీ యొక్క కలల చిత్రీకరణ సంపూర్ణత్వాన్ని సంతరించుకుంది. ఈ చిత్రాలన్నిటిలోనూ మనం కనే కలలు పూర్ణాకృతిలో గాక, ఛిద్రమైన కళాఖండికలుగా, గాలిలో దూది పింజలలా తేలియాడుతూ, ఏ భావానికి ఆ భావమే స్వతంత్ర ప్రతిపత్తిని నిలుపుకుంటున్న మణిహారాల్లా శోభిస్తాయి. ఈ చిత్రాలను చూస్తున్న వీక్షకునికి ఈ చిత్రాలు అర్థమైనా, కాకపోయినా అతనిపై ఒక మాయా జలతారును పరుస్తుంది. ఆ ఉచ్చు నుంచి తప్పించుకోవటం కనులున్న వానికెవరికైనా అసాధ్యం. అదొక అపూర్వమైన హృదయగానం. వీక్షకుని చేయి పట్టుకొని, తనదైన లోకాలకు తీసుకొనివెళ్ళి ఒక పారవశ్యంలో తలమునకలు గావించే కమ్మని కలలాంటి వాస్తవం. అనితర సాధ్యమైన రసలోకం అది. అది ఒక విషయం కాదు ఒక అనుభవం. 1929 నుంచి అతని రస ఝురి అప్రతిహతంగా జరిగింది. 1938వ సంవత్సరంలో అతని చిత్రాలకు మూల విరాట్టువైన ఫ్రాయిడ్‌ను ఇంగ్లండులో కలిసాడు. 1939లో ఫ్రాయిడ్ మరణించాడు. అదే సమయంలో యూరోప్ అంతా యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. అక్కడ నుంచి అమెరికా వెళ్ళాడు. 1948 వరకూ అమెరికాలోని వర్జీనియా, కాలిఫోర్నియా, న్యూయార్క్ నగరాలలో అంతులేని ప్రజాదరణతో, అభిమానుల మధ్య జీవించాడు. అక్కడే 1942లో రహస్య జీవితం (Secret life) అనే పేరుతో తన ఆత్మకథను ఆవిష్కరించాడు. దానిలో తన భావాలనూ, అంతరంగాలనూ, నిస్సంకోచంగా, నిసిగ్గుగా వెలువరించాడు. తన చిత్ర రచనా పద్ధతి గురించి చెబుతూ, ''సూర్యోదయానికి పూర్వమే మేల్కొంటాను. ముఖం కడుక్కోకుండా, దుస్తులు మార్చుకోకుండా చిత్తరువులు వేసే బల్లముందు కూర్చుంటాను. కుంచె ఎటు నడిస్తే అటు నడిపే ఆటోమేటిజమ్ (Automatism, డాడాయిజంలో ఒక ప్రక్రియాశైలి) కు చెందిన చిత్రకారుని కాకపోవటము వలన 'ఏదో నవీన భావం' మనస్సులో రూపుదిద్దుకొనేవరకూ ఆ కాన్వాస్ కేసే చూస్తూ వుంటాను, ఆ తరువాత చిత్రం వేయటం ప్రారంభిస్తా'' నన్నాడు. తన భావాలను కాన్వాస్‌పై తాను అనుకొన్న రీతిలో చిత్రీకరించ లేకపోయినప్పుడు తల బాదుకొనేవాడు, ఒకొక్కప్పుడు రక్తం కూడా వచ్చేది.

అమెరికాలో గడిపిన రోజులలో ప్రముఖ హాలివుడ్ దర్శకుడైన హిచ్‌కాక్ ''స్పెల్ బౌండ్'' అనే పేరు గల ఒక చిత్రాన్ని గ్రిగరీపెక్, ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మెన్‌లతో నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలోని కథానయకుడు ఒక విధమైన అమ్నీషియా (Amnesia) (తాత్కాలిక మరుపు) తో బాధపడుతుంటాడు. అతని గతాన్ని గుర్తుకు చేసే ప్రయత్నాలన్నీ వమ్ముకావటంతో ఒక మానసిక విశ్లేషకుని వద్దకు తీసుకొని వెడతారు. అయితే అతను చివరి ప్రయత్నంగా ఇతని మస్తిష్కంలో దాగి వున్న నిన్నటి జ్ఞాపకాలను, అతనికి వచ్చే కలల ద్వారా విశ్లేషించే ప్రయత్నము చేస్తాడు. ఆ ప్రయత్నంలో అతను - చెప్పిన కలల దృశ్యానికి చిత్ర రూప మివ్వడానికి డాలీని ఎన్నుకున్నారు. ఆ కలల సెట్టింగులను తన దైన అధివాస్తవిక ధోరణిలో చిత్రించి గొప్ప పేరు తెచ్చుకున్నాడు. ఆ చిత్రం కాసుల వర్షం కురిపించింది. దానిలోని ప్రధాన ఆకర్షణ డాలీ రూపు దిద్దిన స్వప్న దృశ్యాలే. ( ఆ చిత్రం తెలుపు - నలుపులలో చిత్రించ బడింది). తరువాత వచ్చిన అనేక చిత్రాలకు ఈ చిత్రంలోని స్వప్న దృశ్యాలే ప్రేరణగా నిలిచాయి. ఎందరో భారతీయ దర్శకులు అటువంటి మానసిక విశ్లేషణతో కూడిన స్వప్న దృశ్యాలపై దృష్టి నిలిపారు ( ఇందులో ముఖ్యమైనది రాజ్‌కపూర్ దర్శకత్వం వహించిన 'ఆవారా' చిత్రంలోని కల సన్నివేశం, I.S. జోహార్ దర్శకత్వం వహించిన 'నాగిన్' లోని పతాక సన్నివేశాలు), వాల్ట్ డిస్నీ కూడా డాలీ సాయంతో 'డెస్టినీ' అనబడే ఒక వినూత్న మైన కార్టూన్ చిత్రం తీయాలనుకున్నాడుగానీ అది సమగ్ర రూపం ధరించలేదు.

అమెరికాలో వున్న కాలంలో అతను మతపరమైన అనేకమైనవి తనదైన రీతిలో చిత్రించి మన్ననలను పొందాడు. ఈ చిత్రాలలో 'శిలువ వేయటం', 'ది సాక్రమెంట్ ఆఫ్ లాస్ట్ సప్పర్' లాంటివి క్లాసికల్గా విమర్శకులు భావించారు. అమెరికాలో వున్నప్పుడు బట్టలకూ, నగలకూ డిజైన్లు వేసి ప్రజలను వెర్రెత్తించాడు. అమెరికా నుంచి వచ్చిన తరువాత అతను పూర్తిగా డబ్బు మనిషిగా మారాడు. అమెరికా నుంచి యూరోప్కు వచ్చి పారిస్, బార్సిలోనా, స్పెయిన్ నగరాల మధ్య తిరుగుతూ జీవితం సాగించాడు. జీవితాంతం అలుపెరుగని కళాస్రష్టగా బ్రతికాడు. 1965వ సంవత్సరంలో తన రెండవ ఆత్మకథ మేధావి దినచర్య (డైరీ ఆఫ్ జీనియస్)ను ప్రచురించాడు. జీవితంలో అతను పొందిన మన్ననలు, పురస్కారాలు వందలు పై చిలుకు ఉంటాయి. అందులో అత్యంత ఉత్కృష్టమైనది ''గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ లిబెల్లా ది కాథలిక్'' (Grand Cross of the Order of Lebella the Catholic) అన్నది. ఇది స్పెనిష్ ప్రభుత్వ పురస్కారం. (ఇది ఇంచు మించుగా మన 'భారతరత్న' కు సమానమయినది). డాలీ పికాసో లిద్దరూ స్పెయిన్ దేశస్థులైనప్పటికీ ఇద్దరి మధ్యా రాజకీయ పరమైన సిద్ధాంతిక వైరుధ్యాలున్నాయి. స్పెయిన్ అంతర్ యుద్ధం ద్వారా నియంతయిన ఫ్రాంకో పై డాలీ ఏవిధమైన శత్రు వైఖరిని ప్రదర్శించలేదు. పై పెచ్చు మిత్ర భావం చూపాడు. ఫ్రాంకో ఆహ్వానం పై స్పెయిన్ దేశం వెళ్ళినపుడు ఫ్రాంకో డాలీ దంపతులకు దగ్గరుండి ఆహ్వానం పలికాడు. ఫ్రాంకో మనుమరాలి చిత్రాన్ని గీసి ఫ్రాంకోకు బహుమతిగా ఇచ్చాడు. ఫ్రాంకో మరణించిన తరువాత రాచరికం తిరిగి అధికారంలోనికి వచ్చినపుడు స్పెయిన్ దేశపు రాజయిన కార్లో డాలీని 1981వ సంవత్సరంలో స్పెయిన్ దేశపు 'నోబిలిటీ' కి అర్హమైన వాడుగా ప్రకటించాడు. (ఇది ఇంగ్లండులోని నైట్హూడ్ లాంటిది). 1982వ సంవత్సరములో జీన్ రిలాలిట్ ఆఫ్ కాటలోనియా (Gene Relalit of Catalonia) బంగారు పతకంతో సత్కరించబడ్డాడు. డాలీ ఆత్మకథయే కాక 'డాలీ' జీవిత చరిత్రను చాలామంది వ్రాశారు. అందులో ముఖ్యమైనది డాలీ సోదరి మారియా రచించిన 'సమ్ నోట్స్ ఆన్ సాల్వడార్ డాలీ' ప్రసిద్ధమైనది. ప్రఖ్యాత రచయిత జార్జి ఆర్వెల్ డాలీ వేసిన చిత్రం 'బెనిఫిట్ ఆఫ్ క్లర్జీ సమ్ నోట్స్ ఆన్ డాలీ' అనే వ్యాసాన్ని వ్రాసాడు.

డాలీ సిద్ధాంత పరమైన సర్రియలిస్టు కాదు. 1936వ సంవత్సరంలోనే ఈ అధివాస్తవిక వాదుల (Surrealists) తో విభేదించి, నాకు సర్రియలిస్టులకు ఒకటే తేడా నేను సర్రియలిస్టును కావటం అని పేర్కొన్నాడు. సంకేతిక పరంగా డాలీ చిత్రాలు చాలా ఉత్కృష్టమైనవి. తనవి పెయింట్ చేయబడ్డ ఫోటోగ్రాఫులని డాలీ భావించాడు. చిత్రకళా విమర్శకులు సర్రియలిజాన్ని డాలీకి ముందు డాలీకి తరువాత అని రెండుగా సిద్ధాంతీకరించారు. డాలీ ప్రభావానికి ఈ ఒక్కటే చాలు.

అతని చిత్రాలలో కనిపించే అనేక భావస్పోరకాలలో ముఖ్యమైన రూపాలు:- మండుతున్న జిరాఫీలు, పలుచగా మెత్తగా ఉండి బట్టల వలే దండాలు పై ఆరవేయబడ్డ వాచీలు. సొరుగులతో కూడిన మానవాకృతులు, సన్నటి పంగల కర్రలపై నిలబెట్టబడిన మానవ ముఖాలు.

డాలీ చిత్రకారుడే కాదు, కవి, శిల్పి, సినీ రచయిత. ఒకనాటి సహాధ్యాయి బూనెల్తో కలసి సినిమాలు తీశాడు. ఇందులో ఒక వ్యక్తి కనుగుడ్డును చాకుతో కోయటం లాంటి దృశ్యాలు వుండటంతో ఇది ప్రశంశలతో బాటు విమర్శలూ పంచుకుంది. ప్రఖ్యాత మైన హాస్యనట సోదరులు మార్క్స్ బ్రదర్స్కు స్క్రీన్ ప్లే వ్రాసి ఇచ్చాడు. డాలీకి పిలిప్ హాల్స్మన్ (Phillipe Halsman) అనబడే ఫోటోగ్రాఫర్తో గాఢమైన స్నేహం వుంది. అతను డాలీని మోడల్గా పెట్టుకొని డాలీ ఆలోచనలను

ఫోటోగ్రాఫ్‌లుగా చిత్రించాడు. డాలీ చిత్రాలవలేఇవి కూడా చాలా ప్రసిద్ధి పొందాయి. ఈనాడు గ్రాఫిక్స్‌తో సాధిస్తున్న అనేక వింతలు అతను 50, 60 దశకాల మధ్యనే చూపి ప్రశంసలందుకున్నాడు.

**ప్రేమికుడు :**

గొప్ప చిత్రకారునివలే డాలీ గొప్ప ప్రేమికుడు కూడా. మేడ్రిడ్‌లో చదువుకుంటున్న సమయంలో గార్షియాలోకా అనే యువ కవితో అతనికి గాఢమైన సంబంధాలుండేవి లోకాను కలసేంత వరకూ శరీర సంపర్కమంటే ఏమిటో తెలియదని ఆత్మకథలో వ్రాసుకున్నాడు. డాలీ అధివాస్తవిక ధోరణుల వైపు ప్రయాణం సాగించిన కొద్దీ లోకాతో స్నేహం దూరమైంది.

పికాసో ఘనవాదానికి ముగ్ధుడై అతని ఆరాధకునిగా మారి 1926వ సంవత్సరంలో పికాసోను కలిసినపుడు, పికాసో ద్వారా అతని మిత్రుడైన పాల్ ఎలార్డ్‌తో స్నేహం కుదిరింది. (పాల్ ఎలార్డ్ గుయెర్నికా విజయం వ్రాసిన కవి). అప్పటికి రెండు సంవత్సరాల క్రితమే పాల్‌ఎలార్డ్ గాలా అనే ఒక మాస్కో లాయరు కూతురును వివాహం చేసుకున్నాడు. గాలాకు చిత్రకళపై ఆసక్తి, అనురక్తి ఎక్కువ. డాలీ వేసిన చిత్రాలు ఆమెను పదే పదే ఆకర్షించటంతో తరచు వచ్చి డాలీని కలిసేది. డాలీ ఆమె సౌందర్యాన్ని చూసి మోహావేశుడైనాడు. చూడ చక్కని కనుముక్కు తీరు, గొప్ప శరీర ధారుఢ్యం, పసితనం పోగొట్టుకోని మేనిఛాయ అతన్ని వివశున్ని చేశాయి. తన జీవితంలో అంత గొప్ప అందగత్తెను చూడలేదన్నాడు. ''మొదటి చూపులోనే తెలుసుకున్నాను, ఆమె నాదని, నా కోసమే పుట్టిందనీ'' ఆత్మకథలో చెప్పుకున్నాడు. పరిచయమైన కొన్ని రోజులకే ఆమె వివాహితయినా సంకోచం లేకుండా ఆమె పై తనకున్న ప్రేమ భావాన్ని వెల్లడించాడు. అప్పటికే డాలీ చిత్రాలతో, డాలీ పై విపరీత ఆకర్షణను పెంచుకొన్న గాలా అతని ప్రేమను తిరస్కరించలేకపోయింది. చివరకు 1932వ సంవత్సరములో పాల్‌ఎలార్డ్‌తో విడాకులు పొంది డాలీకి, స్నేహితురాలు నుంచి ప్రియురాలుగా మారి అతనితో కలసి జీవించి, 1958వ సంవత్సరంలో అధికారికంగా అతని సహధర్మచారిణయింది.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత వెల్లివిరిసిన స్వేచ్ఛా భావాలతో విశృంఖలంగా జీవించిన అనేకమంది చిత్రకారుల వలే కాక జీవితాంతం ఆమెనే తన సర్వస్వంగా భావించాడు డాలీ. ఆమెను ప్రేమించి, ఆమెచే ప్రేమించబడి ఆ ప్రేమను చివరి దాకా నిలబెట్టుకున్నవాడు డాలీ. ఆమె పై ఆర్థికంగా, కళాత్మకంగా, లైంగికంగా అతను పూర్తిగా ఆధార పడ్డాడు (She took charge of every aspect of his existence, financial, artistical and sexual). అతను వేసిన అనేక స్త్రీ చిత్రాలలో సగానికి పై చిత్రాలు గాలావే. ఆమె 60 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు కూడా ఆమె నగ్న చిత్రాలు వేశాడు. ఆమెకు ప్రేమతో బహూకరించిన ప్లాబో భవనం ఈనాడు 'డాలీగాలా' మ్యూజియమ్‌గా ప్రసిద్ధి నొందింది.

ఎంతో హాయిగా సాగుతున్న జీవన నౌక ఒక్కసారిగా తుఫానులో చిక్కుకున్నట్లు అతలా కుతలమైంది. 1982 జూన్10వ తేదీన అకస్మాత్తుగా గాలా మరణించింది. ఆమె మరణ వార్త వింటూనే అతని మొదటి స్పందన ఆత్మహత్య చేసుకోవాలనుకోవటం. దానికిగాను అతను కొంతకాలం ఆహారం తీసుకోలేదు. తరువాత హితోభిలాషుల జోక్యంతో అతి తక్కువగా ఆహార పానీయాలు తీసుకునేవాడు. ఆమె మరణంతో చిత్రాలు వేయటం తగ్గి పోయాయి. 1983వ సంవత్సరం నుండి చిత్రాలు వేయడానికి స్వస్తి చెప్పాడు. గాలా మరణించిన తరువాత ఆమెకు బహూకరించిన ప్లాబో భవనంలోనే ఏకాంతంగా జీవించాడు. ఎవరినీ కలవడానికి ఇష్టపడే వాడుకాదు. తక్కువగా ఆహారం

తీసుకోవటంతో గొంతు గట్టిపడి కాన్సర్‌కి దారి తీసింది. క్రమేపీ గొంతు పోయింది. మాటలలో స్పష్టత లోపించింది. పనివాళ్ళను పిలువడానికి ఉంచిన కాలింగ్ బెల్ షార్ట్ సర్క్యూటయి జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడ్డాడు. తన చివరి శ్వాస వరకూ తను గాలాల మధుర స్మృతులతో పెనవేసుకున్న ఆ భవనంలో నివసించాలనుకొన్న అతని కోరిక నెరవేరలేదు. బలవంతంగా ఆ భవంతి నుండి బయటకు తీసుకురాబడ్డాడు. గాలా మరణంతో ఏర్పడిన వెలితి పూడ్చుకోలేక పోయాడు. అతని చివరి రోజులు భారంగా, ఏకాంతంగా గడచిపోయాయి. 1984వ సంవత్సరంలో డాలీ జీవిత చరిత్రను రాబర్ట్‌డిషేన్ (Robert Descharres) సాల్వడర్ డాలీ ది వర్క్, ది మాన్ అనే పేరుతో ప్రచురించాడు. 1989 జనవరి 23వ తేదీన హృద్రోగంతో డాలీ మరణించాడు. డాలీ కోరినట్లుగానే అతని పార్ధివ శరీరాన్ని శుభ్రపరచి మైనంతో పూత వేసి కనీసం మూడు వందల సంవత్సరాల వరకూ చెడకుండా వుండేలా ఎంబామ్ (Embalmn) (ఈజిప్షియన్ మమ్మీలలా) చేయబడింది. ఏనాటికయినా మనిషి మృత్యువును జయిస్తాడని అప్పుడు తాను తిరిగి జన్మించగలనని నమ్మిన ఆశాజీవి అతను. అతను పుట్టిన ఫిగారస్‌లో వున్న డాలీ మ్యూజియమ్‌లోనే ఒక క్రిస్టల్‌గాజుతో చేయబడ్డ పారదర్శక శవ పేటికలో అతని శరీరం భద్రపరచబడింది. సందర్శకులు అతని భౌతిక కాయాన్ని అక్కడ సందర్శించవచ్చు. అతనికెంతో ఇష్టమైన కాడిల్లాక్ కారును కూడా దాని పక్కనే వుంచారు.

గాలా మరణించిన తరువాత అతను గాలాపై వ్రాసిన ప్రేమ గీతం. ఈ ప్రేమ గీతం అతనికి గాలా పైనున్న అజరామమైన ప్రేమకు నిదర్శనం.

ఈ గీతం చాలా సరళమైన ఇంగ్లీషులో వ్రాయబడినది. నిజానికి దీనికి అనువాదమవసరం లేదు. అయినప్పటికీ తెలుగు మాతృ భాషగా కలిగి అందులో మాత్రమే ప్రావీణ్యం వున్న వారికోసం ఈ అనువాదం అక్షరం, అక్షరం base గా తీసుకొని చేసిన ఒక Paraphrasing అనువాదం లాంటిది. దీనిలో చందస్సు కోసం వెదక కండి. డాలీ హృదయాన్ని మాత్రం వెదికి పట్టుకోండి:

| *English Original* | *Translation* |
|---|---|
| Source of life | నా జీవన జ్యోతీ ! |
| Nights that never do | ఎంతకీ తెల్లవారని ఈ రాత్రి వేళ |
| I go to the fountain | ఫౌంటెన్ సమీపానికి చేరగానే |
| suddenly byore me | నా ఎద లోయల్లో పదిలంగా |
| The beloved image appears | భద్రపరచు కొన్న నీ ప్రేమైక రూపం |
| Preserved deep in my heart | నా ముందు అకస్మాత్తుగా సాక్షాత్కరిస్తే. |
| I know | నాకు తెలుసు |
| That the bread of life is there | నా జీవన సర్వస్వం నీవేనని |
| Even with my eyes closed | కనులు మూసినా కదలాడే నీ |
| I can still see | దివ్యరూపం, ధవళకాంతికే |
| Radiantly white | వన్నె తెచ్చేలా, నా జీవన సర్వస్వంగా! |
| and sutter by clean | నాకు తెలుసు |
| the bread of life | నిప్పుల కొలిమిలో |
| I know | |
| That there is the oven | |

In the flames of which
the beloved image
of my worshipped Gala is
reflected Above
adorned with
garlands of death
I Know
that in the Womb of the Earth
The block of marble his
in which the image
of my beloved Gala slumbers
Four elements
of my Gala are enter oven,
Fire, water, earth and air
Tell of her
Whom I already know
before I was born.
Air, air, I breath
day and night
with the image of my Gala before my eyes
In Loving memory,
Day and night
I breath the air
of my beloved Gala
In the garden fountain
water falls endlessly
Into depths that never dawn
There I beheld every detail
of the Portrait of Gala
whom I never loved enough.

అగ్ని కీలల్లో నా ఆరాధ్య దేవత
మృత్యువును పూలమాలగా ధరించిన
నా గాలా రూపం ప్రతిబింబంగా కనిపిస్తూ

నాకు తెలుసు
భూమాత గర్భంలో
చలువరాయి పందిట్లో
గాఢ నిద్రలో నా ప్రియ గాలా
పంచ భూతాలతో పెనవేసుకుంది.

నీతో చెప్పాలని ఉంది
నేను పుట్టక ముందే నాకు నీవు తెలుసని
గాలీ, గాలీ, నే పీల్చే గాలి
పగలు, రాత్రీ
నా కన్నుల ముందే గాలా రూపం
నీ ప్రణయ స్మృతులతో
పగలు, రాత్రీ, నే పీల్చేగాలీ
నీవే, నీవే

ఈ ఉద్యాన వనంలో, ఈ ఫౌంటన్
నిరంతరాయంగా పారే జలపాతంలా
వేకువ లేని అగాధాల్లో
ప్రేమించ వలసినదిగా ప్రేమించలేని
నా గాలా ప్రతిబింబం నా హృదయంలో.*

అతని హృదయాంతరాళాలను చీల్చుకొని వచ్చిన గేయమిది.

గాలా విషయంలో నిజంగా అతను అర్ధనారీశ్వరుడే, ఒకచోట విశ్వమంతా వ్యాప్తిచెందిన నా గాలా అని అంటాడు. (My Omnipresent Gale). గేయాలే కాదు రచయితగా కూడా సుమారు 12 పుస్తకాలు వ్రాశాడు. ఒకే స్త్రీని జీవితాంతం ప్రేమించి అలౌకిక ప్రేమతత్వాన్ని నింపున్నవారు చిత్రకారులలో మైఖెల్ ఆంజిలో, మిలేస్, డాలీ అంత గొప్ప ప్రేమికులు చిత్రకారులలో మరెవ్వరూ నాకు కనిపించ లేదు. ప్రణయ జీవులకు వయస్సుతో నిమిత్తం లేదనే దానికి రుజువు డాలీ, గాలాల ప్రణయం. గాలా - డాలీ కంటే వయస్సులో 6 సంత్సరాలు పెద్ద.

**పిచ్చివాడు:**

డాలీ సొగసైన రూపంతో పొందికైన శరీరాకృతి కలవాడు. అయితే తన ప్రత్యేకతను చాటుకోవడానికి

* డాలీ పై నేను వ్రాసిన వ్రాత ప్రతిని చూసి గాలా- డాలీల అనురక్తికి నిదర్శనంగా నిలచిన ఈ గేయాన్ని చదివి, స్పందించి, స్వేచ్ఛాను వాదం చేసిన కవి మిత్రుడు శ్రీ మేడిశెట్టి తిరుమల కుమార్, ఇన్‌కమ్‌టాక్సు అడిషనల్ కమీషనర్‌కు కృతజ్ఞతలతో - రచయిత

మాట్లాడుతున్నపుడు, ఫోటోలు తీస్తున్నప్పుడూ కళ్ళను పెద్దవిగా చేయటం, వదులుగా నున్న టోపీలు ధరించటం, సైకిల్ హాండిల్‌బార్‌ను పోలినట్లుగా సన్నటి మీసకట్టును మైనం సాయంతో గట్టిపరచి మేకుల్లా, మొనదేలేలా పైకి పొడుచుకు వచ్చినట్లు చేసి అప్పుడప్పుడూ వాటికి పువ్వులు గుచ్చుతూ ఉండటం చూసిన వారికతను ఉన్మాదిగా, పిచ్చివానిగా కనిపిస్తాడు. అధివాస్తవిక ధోరణిని ఏ మాత్రం సహించలేని కొందరు సనాతనులతనిని పిచ్చివానిగా జమకట్టారు. అతని జీవితంలో నిబద్ధత లేని తనం, అంతర్ వైరుధ్యాలు ఈ అభిప్రాయాలకు బలం చేకూర్చాయి.

వాటికన్ వెళ్ళి రెండుసార్లు పోప్‌ని కలసి, ముచ్చటించి వచ్చినా, నిబద్ధత పరమైన నైతికతను అతననుసరించలేదు. తన తల్లి చిత్రాన్ని వేసి, ఆ తరువాత దానిపై ఉమ్ము వేయాలనుందని పేర్కొన్నాడు. చిత్రకారునిగా కొడుకు సాధించిన విజయాలకు గర్వపడ్డ తండ్రి మనస్సును చివుక్కుమనేలా చేశాడు. స్నేహితుడైన పాల్ఎల్వార్డ్ భార్యను పెండ్లాడడము తండ్రికి నచ్చలేదు. దానితో ఇంటి నుంచి బయటకు వచ్చి గాలాతో జీవించాడు. డొనా మారియా డాలీ సహోదరి, అతని మొదటి చిత్రాలన్నిటికీ ఆమె మోడల్‌గా ఉంది. ఆమె శరీరం పై కొన్ని అశ్లీల వ్యాఖ్యలు చేశాడు డాలీ. వీటన్నిటికీ డాలీ చెప్పిన సమాధానం మనస్సులో ఉన్నది ఉన్నట్లుగా ఉటంకించటమే తన పని అని దానికి సంఘంలోని నైతికతకు, నిబద్ధతకు సంబంధం లేదని భావించాడు. ప్రపంచ సర్రియలిస్టుల సభకు (1936లో) డైవింగ్ సూట్‌తో రెండు చేతులతో రెండు వేట కుక్కలను పట్టుకొని వచ్చి ఉపన్యసించాడు. అతను ఎన్ని వెర్రి మొర్రి వేషాలు వేసినా అతని అభిమానులు అతన్ని క్షమించి వదిలేశారు. మహోన్నతమైన అతని మేధస్సు ముందు ఇవ్వన్నీ లెక్క చేయదగ్గ అంశాలుగా ఎవరూ పరిగణించలేదు.

పిచ్చివారికి నాకు ఒకటే తేడా నేను పిచ్చివాణ్ణి కాక పోవటం అని చెప్పుకున్నాడు. నన్ను పిచ్చివాణ్ణి కాకుండా ఆపగలిగింది గాలా ప్రేమ మాత్రమే అన్నాడు. నా చిత్రాల ద్వారా ప్రజలను పిచ్చివాళ్ళను చేయటం నా సరదా అనేవాడు.

చిన్న తనంలో తనకంటే పది సంవత్సరాలు ముందు పుట్టి కేవలం ఆరు సంవత్సరాలు జీవించిన తన అన్నగారి ( అతని పేరే డాలీకి పెట్టారు) సమాధిపై పుష్ప గుచ్ఛాలుంచుతున్నపుడు, తాను ఏక కాలంలో బ్రతికి ఉన్నట్లు, మరణించినట్లు, తన సమాధికి తానే శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లుగా ఒక చిత్రమైన భయానుభూతి పొందేవాడు. అతను అధివాస్తవిక చిత్రకారుడు కావడానికి మూలాలు ఇందులో ఉన్నాయని మనో విశ్లేషకులు భావిస్తారు. అతను వేసిన స్త్రీ, పురుష నగ్న చిత్రాలను వెనుక వైపు నుంచి ఎక్కువగా చిత్రించడానికి కూడా ఆ భావాలే కారణ మనిపిస్తాయి.

ఏది ఏమైనా 20 శతాబ్దం గర్వించదగిన స్వాప్నికుడు, చిత్రకారుడు డాలీ, పిచ్చివాడు మాత్రం కాదు.

1966వ సంవత్సరంలో పికాసో చిత్ర కళాప్రదర్శకు సుమారు 8 లక్షల మంది హాజరుకాగా 1979-80 సంవత్సరంలో పెంపేడోలో జరిగిన డాలీ ప్రదర్శనకు వచ్చినవారి సంఖ్య 10లక్షలపై బడింది.

డాలీ మరణంతో ఆధునిక చిత్రకళా ప్రపంచంలో చిట్టచివరి అతిరథుడు నిష్క్రమించాడు. ఇప్పుడు పికాసోతో గానీ డాలీతో గానీ పోల్చదగిన చిత్రకారు లెవరూ లేరు. అంచనాల కందనంత దూరంగా, ఆకాశంలో విశాలంగా విస్తరించిన రమ్యజగత్తు వాళ్ళది. ప్రస్తుత ప్రపంచ చిత్రకళను ఒక శూన్యం ఆవహించి ఉంది. ''మిసిమి'' నాల్గు అట్టలపై చిత్రాలు డాలీవే.

# జిడ్డు కృష్ణమూర్తి 'బోధనలు - దర్శనం'

- షణ్ముఖానంద

జిడ్డు కృష్ణమూర్తి గత కాలపు గొప్ప తాత్వికుడు. మనిషిని అతని జ్ఞాపకాల నుండి విముక్తుణ్ని చేయడమే ప్రధాన ఆశయంగా ప్రపంచం నలుమూలలా తిరిగి తన బోధనల ద్వారా ప్రభావితం చేశాడు. మనిషి యొక్క అన్ని సమస్యలకు, రుగ్మతలకు కారణమైన మనసుని ప్రశాంత పరుచుటకై గమనించే సాధనంగా, ఔషధంగా తన బోధనలను మలచి మనకందించాడు.

ఆయన బోధనల్లో ఆచరణాత్మకత లేదని, అర్థం కాదని ప్రజల భావన.

ఎవరి బోధనల్లో అయినా మనం వెతికేది, ముందుగా చెప్పబడిన సమాధానాలు. మనం ఒక నమూనా లాగా తయారు కావడానికి, ఒక ఆదర్శాన్ని అంటి పెట్టుకుని దాని ప్రకారం నడవడానికి తయారుగా ఉంటాం. ఉన్న స్థితి నుండి, ఉండదలుచుకున్న స్థితికి ప్రయాణం సాగిస్తాం. సరిగ్గా దీనినే ఆయన ఖండిస్తాడు. ఆయన మనకి ఆచరించడానికి ఏదైనా పద్ధతి చెబితే అది ఆచరణాత్మకమా? కాదా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఆయన మనకు బోధించింది ఆచరించమని కాదు, ఉండమని. "He was telling to be, not to do".

మనం ఏమి చేస్తున్నామో, ఎందుకు చేస్తున్నామో, ఏమి చేయకూడదో, ఏమి చేస్తే ఏమి జరుగుతుందో, ఏమి జరగకూడదో, ఎలా ఉంటున్నామో, ఇలా ఎందుకుంటున్నామో అనే విషయాలనే ఎక్కువగా ప్రశ్నిస్తూ విశదీకరించాడు. అప్పుడు సహజంగానే మనం చేసే ప్రతి పనిని ఖండించాడు గనుక మరి ఏమి చేయాలి? అనే సందేహం కలుగుతుంది. ఏమి చేయమన్నాడో అంతుపట్టదు.

కృష్ణమూర్తి బోధనలను మూడు భాగాలుగా విభజించవచ్చు.

మొదటి భాగంలో, ప్రస్తుతం మానవుడు ఉన్న స్థితిని తెలుసుకోవడం. రెండో భాగంలో అందుకు గల కారణాన్ని తెలుసుకోవడం. మూడో భాగంగా పరివర్తన చెందడానికి సాధనమైన గమనింపుని తెలుసుకోవడం.

కృష్ణమూర్తి దృష్టిలో ప్రస్తుతం మానవుడు ఏ స్థితిలో ఉన్నాడో అన్న విశ్లేషణను పరిశీలిద్దాం. ''నేటి మానవుడు ప్రత్యేకమైన ఒక - సంస్కృతి చేత సమాజం చేత నిభందింపబడి, పలురకాల ప్రభావాలకు లోనైనాడు. సంబంధాల్లోని ఒత్తిడి, ఒరవడి, ఆర్థిక, నైసర్గిక, విద్య సంబంధిత అంశాలు వాటిలో ఇమిడి ఉన్నాయి.

ఆగ్రహం, అసూయ, ద్వేషం, దురాశ, పోటీపడడం, పోల్చుకోవడం వీటితో మానవుడి రోజువారి జీవితం బ్రహ్మాండమైన ఉద్రిక్తతతో, ఉద్వేగంతో సాగిపోతుంది.

పూర్వ అభిప్రాయాలతో, నిర్ణయాలతో, భావాలు, ఆదర్శాలు, అపోహలతో స్వేచ్ఛను కోల్పోతూ ఉన్నాడు. చూసిన ప్రతిదానిని వక్రీకరిస్తూ, అనువదిస్తూ, వ్యాఖ్యానిస్తూ ఉన్నాడు. అతని

షణ్ముఖానంద, బౌద్ధ అభిమాని, విపస్సనా ధ్యానంలో ప్రవేశం ఉంది, హైదరాబాదు.

చూపు దురభిప్రాయం, రోషం, వైరం మొదలగు వాటి నుంచే కాక విజ్ఞాన రూపంలో నిల్వ చేసుకున్న అన్ని జ్ఞాపకాలతో కూడా కలుషితమైనది.

మానవుడు నిత్యం ఏదో రూపంలో, దేనితోనో తాదాత్మ్యము పొందుతూ తద్వారా కొద్ది సమయానికి ఉత్తేజం పొందుతూ క్రమంగా ప్రతిస్పందనలో మార్పుని తెచ్చుకుంటూ మనస్సుని కొరడు బారేటట్లు చేస్తూ ఆఖరకు స్పందనా రహిత స్థితికి నెట్టబడి ఉన్నాడు. మానసిక ప్రవృత్తుల ఉత్తేజం కోసమై ప్రాకులాడుతున్నాడు. తోటి మనుషులతో, వస్తువులతో, అభిప్రాయాలతో అతనికి గల సంబంధం లోపభూయిష్టమై నందున సంఘర్షణలకు, సంక్షోభానికి గురి అవుతున్నాడు.

జీవితం యాంత్రికమై, ఆనందరహితమై, దుర్భరమై ఆ దుర్భర జీవితం నుండి పారిపోవడం కోసం రకరకాల వినోద కాలక్షేపాలతో మునిగి తేలుతున్నాడు. అతనిలోని గందరగోళము, అశాంతి, ద్వేష భావము, భయములతో సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాడు.

జీవితం అనేది ఒక చలనం లాంటిది. అనేక సంబంధాలతో సంతతం సాగిపోయే చలనం. ఈ చలనాన్ని జ్ఞప్తిగా, గత స్మృతిగా పెట్టుకుందామని నిరంతరం ప్రయత్నిస్తూ విఫలమై జీవితం అంటేనే భయంతో జీవిస్తున్నాడు. తెలియని దానిని గురించి భయం. తెలిసిన వస్తువులను వదిలి పెట్టి పోతున్నందుకు భయం. ఈ సంసారంతో, ఈ ఇంటితో, ఇంటిలోని సామాన్లతో, చుట్టూ ఉన్నవారితో అతనికి గల సంబంధం, అనుబంధం తెగిపోతున్నందుకు భయం. తెలసిన విషయాలని వదిలి పెట్టడానికి భయం.

మానవుడు తాను ఉన్న స్థితి నుండి, ఉండాలనుకున్న ఆదర్శ స్థితికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ ఉన్నదానికి, ఉండాలనుకున్న దానికి మధ్య ఏర్పడే ఘర్షణతో మానసికశక్తిని కోల్పోతున్నాడు.

పాఠశాల రోజుల నుండి, చనిపోయేవరకు పోల్చి చూడడంతోనే మనిషి చదువు, నిబద్ధీకరణ సాగుతుంది. మరొక వ్యక్తితో గాని, భావంతోగాని పోల్చి చూసుకుంటూ ఇలా ఉండాలి అని, అలా తయారవడం కోసం ఘర్షిస్తూ జీవిస్తున్నాడు.

ఈరకంగా నిరాశతో, అశాంతితో, ఆందోళనతో, భయంతో మానవుడి జీవితం ఎందుకున్నది అని ప్రశ్నించుకుంటే కృష్ణమూర్తి ఏమి చెప్పేవారంటే దీనంతటికి కారణం మనసు అని, ఆలోచన అని, నిబద్ధత అని.

ఆలోచన మనకి చాలా ముఖ్యమైనది. ఒకపనిని నిర్వహిస్తున్నప్పుడు, కార్యకలాపాల్లో పాల్గొన్నప్పుడు ఆలోచన అవసరం. అది లేని యెడల మన జీవితాలు స్తంభించి పోతాయి. ఏ ఆలోచనైతే మనకి అత్యవసరం అయినదో అదే ఆలోచన మన జీవితాలను దుఃఖమయం చేస్తున్నది.

ఆలోచన యొక్క ఆవశ్యకత లేనప్పుడు కాకుండా, ఆలోచన ఆవశ్యకత అయినప్పుడు మాత్రమే ఆలోచించడం సాధ్యమేనా అని కృష్ణమూర్తి ప్రశ్నిస్తాడు.

ఆలోచన గతాన్ని గురించి గాని, భవిష్యత్తు గురించి గాని, ఒక మనోతత్వంగానో, స్వీయ రచన కోసమో ఆలోచించడం మానివేయ గలదా? అని ప్రశ్నిస్తూ ఆలోచనగురించి ఒక స్పష్టమైన అవగాహన మనకి అందిస్తారు.

''ఆలోచన అనగా స్మృతి (జ్ఞాపకం). అనుభవం ద్వారా సంపాదించిన జ్ఞాపకం స్మృతి రూపంలో మెదడులో నిల్వచేయబడి ఉంటుంది. ఆ స్మృతి యొక్క ప్రతి స్పందనే ఆలోచన, జ్ఞాపకం లేకుండా ఆలోచనలేదు. ప్రోగుచేసుకున్న అనుభవాల; ఫలితంగా వచ్చినదే ఆలోచన అనుభవాలు అంటే గతం. గతం లేకుండా వర్తమానంలో ఆలోచన ఉండదు. కాబట్టి ఆలోచన వర్తమానంలోని సవాల్‌కు గతం ఇచ్చిన ప్రతి స్పందన. అనగా ప్రతి చర్య.

జ్ఞాపకాల కొనసాగింపు అయిన స్మృతి అంటే మాటల రూపంలో, వాచ్చరూపంలో పెట్టిన అనుభవాలు. ఒక సవాలు ఎదురైనది దానికి మనం ప్రతిస్పందిస్తాం. అది అనుభవం. ఆ అనుభవానికి వాచ్చ రూపం ఇస్తాం. ఆ మాటల రూపమే స్మృతిని తయారు చేస్తుంది. కనుక ఆలోచనంటే వాచ్చరూపీకరణ. అందుకే మనం పదాలు వాడకుండా ఆలోచించలేం. భావ ప్రసారాం చేయడం కోసం, మనో భావాల్ని బలంగా తయారు చేయడం కోసం మనం ప్రతిస్పందనలను మాటల రూపంలో పెడతాము.

మనం ఎదుర్కొంటున్న సమస్య ఏమిటంటే ప్రతిదానిని వాచ్చీకరణ చేయడం. ప్రతి అనుభవాన్ని మనసు వాచ్చరూపంలోకి మార్చుకోకుండా ఉన్నప్పుడు మాత్రమే మనసు అనుభూతి చెందుతుంది. ఆ స్థితిలో అవగాహన ఉంటుంది. గ్రహించే శక్తి ఉంటుంది.

వర్తమానాన్ని అవగాహన చేసుకోవాలంటే అనుభూతి చెందడం తప్పనిసరి. అయితే ఆలోచనలకు, మాటలకూ ప్రాముఖ్యం ఇచ్చినప్పుడు, అది అనుభూతికి అవరోధం అవుతుంది. ఒక అనుభవపు జ్ఞాపకాన్ని గట్టి పరుచుకోవడం వల్ల తర్వాత జరిగే అనుభవాన్ని స్వేచ్ఛగా అనుభూతి చెందకుండా గట్టి పరచబడిన జ్ఞాపకం నిరోధిస్తుంది.

అంతేకాదు, ఈ జ్ఞాపకాలే నేను, నన్ను, నాత్వాన్నీ సృష్టిస్తున్నాయి. దీనినే ఆత్మ అని కూడా పిలుస్తున్నాము. ఆలోచనే భయాన్ని తీసుకువచ్చింది. రేపు నాకు ఉద్యోగం పోవచ్చునేమో అని ఆలోచిస్తాము, అందువల్ల భయం కలుగుతుంది. జబ్బు చేస్తుంది అనే భయం. నొప్పి అంటే భయం. భయం అనగానే అందులో భవిష్యత్తు గురించి గాని, గతాన్ని గురించి గాని, ఒక ఆలోచనా ప్రక్రియ ఉంటుంది. మనకి బాధ అనే ఒక అనుభవం జరిగింది. అది మరల నాకు రాకూడదని కోరుకుంటున్నాము. ఆ కోరికే భయాన్ని సృష్టిస్తుంది.

ఆలోచన ఒక వస్తువును గురించిన మనోబింబాన్ని సృష్టిస్తుంది. ఆ కల్పానిక బింబం, ఆ వస్తువుని సరిగ్గా చూడనీయక అడ్డు వస్తుంది.

ఆలోచన స్వీయ కేంద్రాన్ని సృష్టిస్తుంది. ఈ స్వీయ కేంద్రం కొంత స్థలాన్ని, ఎడాన్ని ఏర్పాటు చేస్తుంది. భార్యాభర్తల మధ్య, మనకి పొరుగువారికి మధ్య, పరిశీలిస్తున్న అంశానికి పరిశీలకుడికి మధ్య ఎడం ఉంటుంది. ఎడం లేనప్పుడే ప్రేమ ఉంటుంది. ప్రేమ, సౌందర్యం లేప్పుడు సత్యం ఉండదు.

గతం అంటే మనం కూడబెట్టుకున్న జ్ఞాపకాలు. ఈ జ్ఞాపకాలే వర్తమానంలో పనిచేసి భవిష్యత్తుని గురించి ఆశలను, భయాలను తయారు చేస్తుంది. ఈ ఆశలు, భయాలే మానసిక భవిష్యత్తు.''

ఇది మనసు గురించి, ఆలోచన గురించి జిడ్డుకృష్ణమూర్తి విశ్లేషణ. ఈ విశ్లేషణని మనం అర్థం చేసుకున్నట్లయితే కృష్ణమూర్తి మనల్ని ఎలా ఉండమన్నాడో అర్థం అవుతుంది. ఈ ఆలోచన అనే సంపూర్ణ ప్రక్రియను అవగాహన చేసుకోవడంలోనే అంటే స్వీయ జ్ఞానంలోనే మనకు విమోచనం లభిస్తుంది.

మనిషి తన ఆలోచనలని, తన నిబద్ధతని, తన సమస్యల గురించి తెలుసుకోవాలి. ఆ తెలుసుకోవడం అంతర్మథనంతో గాని, విశ్లేషణతో గాని కాకుండా, వాస్తవంగా తాను ఎలా ఉన్నాడో దానిని గురించిన స్పృహతో ఉండాలి. పరిశీలన అంటే గ్రహింపు. వక్రీకరణ, అనుసరించడం, అనుకరించడం, అణిచిపెట్టడం, అదుపులో పెట్టడం అనేవి ఉండకూడదు.

ఆలోచనలను మనోభావాలను ఎరుకతో చూస్తూ ఉండాలి. ఆ పరిశీలనకు ముఖ్యమైనది మనసు స్వేచ్ఛగా ఉండడం. పూర్వాభిప్రాయాల నుండి, నిర్ణయాల నుండి భావాలు, ఆదర్శాలు, అపోహల నుండి స్వేచ్ఛను పొందినప్పుడే నిజంగా పరిశీలించగలము.

ఈ పరిశీలనలోనే ఉన్న స్థితిని గ్రహించిన ఎరుకే తనలో తానే పరివర్తనాన్ని తీసుకువస్తుంది. మన యొక్క క్రమరాహిత్యాన్ని పరిశీలిస్తున్నపుడే క్రమం వచ్చేస్తుంది. ఏదైతే అసత్యమో దానిని తిరస్కరిస్తే అక్కడ సత్యం ఉంటుంది. మనసు తాను ప్రశాంతంగా ఉండవలసిన ఆవశ్యకతను గ్రహించగానే అది ప్రశాంతతతో ఉన్నట్లే. సావధానత లేదు అనే ఎరుక కలగగానే సావధానత ఉంటుంది. నిబద్ధత నుండి మనసు వైదొలిగితే స్వేచ్ఛగా ఉంటుంది.

ఆ సావధానత కలిగిన మనసు దాని నిశ్శబ్దతలో, నిశ్చలతలో నేను అనే కేంద్రం ఉండదు. పరిశీలకుడు అనే కేంద్రమూ ఉండదు. మనలో ఆలోచన లేనప్పుడు ఆలోచించే వాడూ ఉండడు. ఆలోచించే వాడే ఆలోచన. ఆలోచన, ఆలోచించే వాడు వేర్వేరుగా లేరు. రెండూ కలిపి ఒకే ప్రక్రియ. కాబట్టి ఉన్నది ఆలోచన మాత్రమే. ఆలోచించేవాడు లేనప్పుడు ఆలోచనలను అదుపు చేయడం ఉండదు. ఆలోచనలకు సొంత అస్తిత్వం లేదు. సావధానత లేకుండా వాటిలో మమేకం అయినప్పుడు మాత్రమే వాటి అస్తిత్వం ఉంటుంది. మనం పరిశీలిస్తున్నప్పుడు వాటికి శక్తిని ఇవ్వడం లేదు. వాటితో మమేకం కాలేదు కాబట్టి అవి నశించి పోతాయి.

ఈ పరిశీలనలో అనేక అపోహలు ప్రజలలోనే కాదు మేధావులలో సైతం వున్నాయి. ''అశ్వత్థ వృక్షమూ పడక కుర్చీ'' అనే తన వ్యాసంలో అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి గారు (మే 2002 మిసిమి పేజి నెం. 132) ఇలా వ్రాస్తారు :

''విపస్సన విధానం లాంటి ధ్యానం మరొకటి లేదు. ఇతర విధానాలలో సమాధి స్థితితోనే ధ్యానం ఆగిపోతుంది. అంటే మనస్సును ధ్యాన వస్తువుపై కేంద్రీకరించి, ఆ వస్తువులతో మమేకం కావడం, అక్కడే ఆనంద డోలికలలో తేలియాడడం అంతవరకే. ఇంక ఆపైన ఏమీ ఉండదు. కాని బుద్ధుని

విపస్సనా ధ్యానంలో ఈగో ప్రవాహం రెండుగా చిట్లి, అందులో ఒక భాగం రెండో భాగంలో సంభవించే అనుక్షణిక మార్పులను పరిశీలించే శక్తిని సంతరించుకొంటుంది.''

ఇది వాస్తవం కాదు. ఈగో ప్రవాహం రెండుగా చీలటం అనేది సంభవించదు. ముందుగా సంభవించేది అనుక్షణం మార్పు. ఆ మార్పును అదే ప్రవాహం తర్వాత జ్ఞాపకం చేసుకుంటుంది.

షణ్ముఖానంద, ఈగో చీలికను గురించి చేసిన ప్రస్తావనకు అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి వివరణ: అది **Therapeutic split.** వాస్తవానికి ఈగో లేదు చిట్లడం లేదు. మనం అర్థం చేసుకోవడానికి అలా రాయవలసి వచ్చింది. **It rains** అనే వాక్యంలో **it** దేనిని సూచిస్తుంది. అది **grammatical subject** మాత్రమే అది లేకుండా వాక్యం రాయలేము. అలాగే అక్కడ ఈగో వ్యవహారం అసలు బుద్ధుని మతంలో లేదు. ఈగో లేదని నిరూపించడమే బుద్ధుని లక్ష్యం. ఎరుక ఉంటుంది కాని ఎరిగే వాడు లేడు. ప్రవాహమే ఉంటుంది. ప్రక్రియ మాత్రమే ఉంటుంది. దీని కర్త ఎవడూ లేడు. ప్రవాహంలో ముందరి భాగాన్ని తరవాత భాగం గుర్తు చేసుకొంటుందని షణ్ముఖానంద రాశారు. ఇది నే రాసిన చీలికలాంటిదేనని గమనిక.

ఈ గడచిన క్షణంలో నాలో ఇలాంటి మార్పు సంభవించింది అని. అనగా అది స్మృతి మాత్రమే. ఇక్కడ మూడు విషయాలు సంభవిస్తున్నాయి. అయితే ఏదీ ఏక కాలంలో సంభవించదు.

ఒకటి : అనుక్షణం మార్పు సంభవించడం.

రెండు : ఆ మార్పును అనగా గతాన్ని నెమరు నేసుకోవడం గుర్తించడం. ఆ నెమరు వేసుకోవడమే గుర్తించడమే, ఎరుక కల్గివుండటమే పరిశీలనగా భావిస్తాము.

మూడు : ఏ స్థితి కలగకుండా అనగా పై రెండు సంభవించకుండా శూన్యంగా, స్తబ్దంగ ఉండటము.

అందుకే జిడ్డుకృష్ణమూర్తి భయం గురించి విశ్లేషిస్తూ ''గమనించేవాడే గమనించబడేది.'' సంపూర్ణంగా నూతనమైనది ఏదో ఆవిర్భవించినపుడు గమనించేవాడు ఉండనే ఉండడు. కానీ, గమనించే వాడు తనలో కలిగిన భయంగా గుర్తించినందువల్ల, రెంటి మధ్య విభజన ఏర్పడింది''. అనగా మనం గమనించేది పరిశీలించేది అంతకు మునుపే మనలో కలిగిన ప్రతిస్పందనని.

ఈ పరిశీలన కృష్ణమూర్తి చెప్పినంత సులువుకాదు. ఎందుకంటే మనస్సు ఆలోచనలతో తదాత్మణ చెందుతూ ఉంటుంది.

మనిషి నాగరికుడు అవుతున్న కొలది ప్రకృతికి దూరం అవుతన్న కొలది, సహజత్వాన్ని కోల్పోతున్న కొలది, అవసరాలు పెరుగుతున్న కొలది మనస్సుపై పనిభారం పెరుగుతుంది.

నెమ్మదైన మనస్సు మాత్రమే గమనించగలదు. నెమ్మదైన మనస్సు కలిగి ఉండాలంటే మనిషియొక్క ప్రస్తుత జీవన విధానంలో పూర్తి మార్పు రావాలి. మానవుడికి ఇప్పుడున్న అవసరాలలో 90 శాతం అవసరాల ఆవశ్యకతలేకుండా పోవాలి.

పరిశీలన, గమనింపు అంటే ఏమిటి? ఎలా జరుగుతుంది? మొదటగా ఆనాపానసతి వంటి ఏకాగ్రత సాధనతో మొదలుపెట్టవాలసి ఉంటుంది. మనస్సుని ఒక ధ్యాన వస్తువుపై లగ్నం చేసినపుడు అది ఆ ధ్యాన వస్తువుపై నిలకడగా ఉండలేక తనకు అలవాటైన ఆలోచనతో మమైక్యము అవుతుంది. అలా అవటం సాధకుడు గమనిస్తాడు. తిరిగి ధ్యాన వస్తువుపై మనసు లగ్నం చేస్తాడు. అలా మనసు ధ్యాన వస్తువుపై కాసేపు ఆలోచనలతో మమైక్యం అవుతూ, కాసేపు ఊగిసలాడుతుంది. ఇలా చేస్తుండగా మనసు వేగం తగ్గి ధ్యాన వస్తువుపై ఏకాగ్రత సాధ్యమవుతుంది.

ఇంతటితో ఈ సాధన వదిలి పెట్టి మనస్సునే ధ్యాన వస్తువుగా ఎంచి మనస్సుపై ఏకాగ్రతను ఎక్కు పెట్టాలి. అనగా అప్రమత్తత వున్న చోట ఆలోచన వుంటుంది. ప్రతి పరిశీలన అనగా అప్రమత్తత. అప్పుడు అక్కడ ఉపసంహరణకు గురై మనసు సబ్దత పొందుతుంది. స్పృహ అనునిత్యం మనస్సుని, ఆలోచనలను, ఉద్రేకాలను గమనించవలసిందే. గమనిస్తూ వుంటే మనకు ఎరుక అవుతుంది. ఇది నా నిబద్దీకరణ అని ఎరుక అయిన మరుక్షణం అది కరిగిపోతుంది. దాని నుండి స్వేచ్ఛ లభిస్తుంది. కోపం, వైఫల్యం, దుఃఖం, నిరాశ, ద్వేషం అన్ని విషయాలను అన్ని వేళలా గమనిస్తూనే ఉండాలి. ''నాకు పూర్తిగా జ్ఞానోదయం అయ్యింది. ఏదీ నన్ను ముట్టుకోదు అనటానికి వీలులేదు.'' అంటాడు జిడ్డుకృష్ణమూర్తి.

కృష్ణమూర్తి తన దగ్గరకు వచ్చిన సందర్శకులకు సైతం తన మూడు భాగాల, సూత్రాల పద్ధతిలోనే వివరణ ఇచ్చేవాడు. మొదటగా వాళ్ళ వాళ్ళ సమస్యని వాళ్ళ మనసు ఉన్న స్థితిని విశ్లేషించేవారు. రెండవదిగా, అలా ఎందుకున్నారు? దాని వెనుక ఉన్న వారివారి ఆలోచనలు, సిద్ధాంతాలు, నమ్మకాలు, అభిప్రాయాలు, విశ్వాసాలు వీటన్నింటిని గురించి విడమర్చి చెప్పేవారు. మూడవదిగా ఆ ఉన్న స్థితిని, సమస్యని, ఆలోచనని, పరిశీలించమనేవారు. ఆ పరిశీలనలో సమర్ధింపుగాని, ఖండించడంగాని ఉండ కూడదనే వారు. అలా పరిశీలనలో భయం, లేదా కోపం, లేదా దిగులు, ఆవేశం మొ॥ ఏమైనా చల్లారి మనస్సు నెమ్మదించి సమస్య అర్ధమవుతుంది. తక్షణం కర్తవ్యం భోద పడుతుంది అంటారు.

కృష్ణమూర్తి చెప్పిన (లేదా) బోధించిన పరిశీలన, గమనింపు, స్వీయ జ్ఞానం అనేది బుద్ధుడు చెప్పిన చిత్తోపాసనే కాని మరొకటి కాదు. కృష్ణమూర్తిపై బుద్ధుడి ప్రభావం అధికంగానే ఉన్నది. బుద్ధుడి నాలుగు ఆర్య సత్యాల సారాంశమే కృష్ణమూర్తి బోధనల సారాంశం. మొదటి ఆర్య సత్యం : ''ఇది దుఃఖం'', మానవ జీవితంలోని అనేక సమస్యలని పరిశీలిస్తుంది. అదే కృష్ణమూర్తి బోధనల మొదటి విభాగం. రెండవ సత్యం దుఃఖ కారణం తృష్ణ, అవిద్య అంటుంది. కృష్ణమూర్తి అలా అనకుండా ఆలోచనే మానవుడి దుఃఖానికి కారణం అంటాడు.

మూడవ, నాల్గవ సత్యాలు అయిన దుఃఖ నివారణ, నివారణ మార్గాల్ని కలిపి కేవలం పరిశీలనగా చెప్పినారు కృష్ణమూర్తి.

అనాపాన సతి మొదలగు ఏకాగ్రత సాధన చేయనిదే మనస్సు నెమ్మదికాదు. నెమ్మదైన మనసు మాత్రమే తనను తాను పరిశీలించుకోగలదు. అప్రయత్నంతగా ఉండగలదు. ఆ పరిశీలనతోనే మనస్సు నెమ్మదించి భావరహితస్థితిని పొంది ప్రశాంతంగా నిశ్చలంగా, స్వేచ్ఛగా ఉండగలదు. నిశ్చలమైన మనస్సు మాత్రమే స్పందించగలదు. అనుభూతి చెందగలదు.

# ఇల్లు

- వింజనంపాటి రాఘవరావు

''అయ్యా! సుబ్బారావు గారిల్లెక్కడా'' అని వాకబు చేస్తే ''ఆయన ఇల్లు ఎక్కడండీ అన్నాడట ఓ చమత్కారి.

తమరి ఇల్లెక్కడండీ అని భావకవి కృష్ణశాస్త్రిగారిని అడిగితే

''నా నివాసమ్ము తొలుత గంధర్వలోక

సుషమా సుధాగాక మంజువాటి'' అంటూ సంస్కృత పదభూయిష్టమైన గీతాచరణాన్ని వినిపించారు.

''ఇల్లే ఇలలో స్వర్గమని'' ఓ సినీ కవి వర్ణిస్తే

'ఇల్లు కట్టి చూడు, పెళ్ళి చేసి చూడ' మంటూ ఇల్లు కట్టటంలోని ఇబ్బందుల్ని నెమరేసుకున్నాడో అనుభవజ్ఞుడు.

పరమేశ్వరుణ్ణి ''ఇల్లు వాకిలి లేనివాడు''గా ఓ కవి వర్ణిస్తే, విశ్వమంతా ఆ దేవ దేవుని ఇల్లుగా వర్ణిస్తూ ''ఆలయం భువనాలయం'' అన్నాడింకో కవి.

గుడిసె, చుట్టిల్లు - ముంగిలి, లోగిలి - పూరిల్లు, భవంతి - పెంకుటిల్లు, డాబా, - బంగళా, అపార్టుమెంటు - గది ఒకటున్నా, ఎన్నునా, ఎలా కట్టినా - ఇవన్నీ ఇళ్ళే. వీటిలో కొన్నింటినో, అన్నింటినో మీరు చూసే ఉంటారు.

మనకు ఎక్కడ స్వంత ఇల్లుంటే ఆప్రదేశాన్నే మన స్థిరనివాసం అంటాం. ఇల్లు కట్టుకోవటం, దాన్ని కాపాడుకోవటం మానవ జాతికే పరిమితమైన విషయం కాదు. ఈ ఇల్లు కట్టడాన్ని ఒక ప్రత్యేకమైన కళగా, జాతి లక్షణంగా - ఎవరూ నేర్పకుండానే నేర్చుకున్న జంతువులున్నాయి ప్రాణి ప్రపంచంలో. లేదా! ఉన్నంతలోనే సర్దుకుపోవేవీ ఉన్నాయి.

''అడవిలో వానొస్తే ఏనుగేం చేస్తుంది?'' అని ప్రశ్నిస్తే ''తడుస్తుంది'' అన్నాడో గడుగ్గాయి. అవును నిజమే ఇల్లు లేకపోతే తడవక ఏం చేస్తుంది? నేలలో బొరియలు చేసుకుని నివసించేవి, మట్టితో ఇల్లు కట్టుకునేవి, చెట్లు తొర్రల్లో, రాతి గుహల్లో కాపురం వుండేవి. పుల్లా, పుడకలతో ఇల్లు కట్టేవి, రాళ్ళ క్రింద, చెట్ల బెరడు క్రింద నివసించేవి, మంచులో గుహలు త్రవ్వుకుని నిద్రపోయేవి, - రకరకాలు - జంతు ప్రపంచంలో చాలావరకు ఇళ్ళు - పిల్లల్ని కని పెంచటానికి కట్టినవే.

మనకున్న కొద్దిపాటి సమయంలో అందరిళ్ళూ చూడలేం కాబట్టి, కొద్దిమంది జంతు మిత్రులు ప్రత్యేకంగా కట్టుకున్న ఇళ్ళు చూసొద్దాం. బయల్దేరండి.

---

వింజనంపాటి రాఘవరావు, జంతుశాస్త్రోపన్యాసకుడు, ఆం.ప్ర.గు. జూనియర్ కళాశాల,

పోలీసుబ్యారెక్స్, హిందూపురం, అనంతపురం జిల్లా - 515 202.

అత్యంత ప్రాథమిక జీవులైన ఏకకణ జీవులు ప్రత్యేకంగా ఇల్లు కట్టుకోలేవు. కాని తమని తాము రక్షించుకోవటానికి శరీరం చుట్టూ ఒక గట్టి కవచాన్ని నిర్మించుకుంటాయి. వీటినే ఫోరామినీఫెరా (Foraminifer) జీవులంటారు. ఇటువంటి ఇంటిని తమతో మోసుకుపోయే జీవులుగా తాబేళ్ళను, నత్తగుల్లలనూ వర్ణిస్తారు.

బల్ల పరుపు పురుగులు కుళ్ళుతున్న ఆకులకిందనో రాళ్ళక్రిందనో కాలక్షేపం చేస్తాయి. మరికొన్ని - ఇతర జీవుల శరీరంలోకి ప్రవేశించి తిండి, నీడ కూడా అక్కడే సంపాదించుకుంటాయి. వెచ్చని సముద్రపు నీటిలో నివసించే కోరల్స్ అనే ప్రవాళాలు సున్నంతో తమ చుట్టూ ఒక కర్పరాన్ని నిర్మించుకుంటాయి. వాన పాములు తాము మట్టిని తినటం వలన ఏర్పడ్డ బొరియలనే నివాసాలుగా చేసుకుంటాయి. వానపాము వర్గానికేచెందిన ట్యుబిఫెక్స్, కీటాప్టెరిస్ వంటివి నీటి అడుగున నివసిస్తున్నా అక్కడ ఓ బొరియను నిర్మించుకుంటాయి.

(Arthro Poda) 'ఆర్థ్రోపొడ' అని పిలిచే అతుకులు గలిగిన కాళ్ళు గల జీవుల ఇళ్ళు అత్యంత వైవిధ్య భరితంగా ఉంటాయి.

పాటర్ వాస్ప్ (Potter Wasp) అనే కందిరీగ మట్టి ముద్దల్ని ఉమ్మితో తడిపి ఓ కుండలాగా తయారు చేస్తుంది. దానికి అంచు, మూతి కూడా ఉంటాయి. దానిలో ఓ గొంగళి పురుగును వదలి, గొంగళి పురుగుపై గ్రుడ్డు పెట్టి ద్వారం మూసేస్తుంది. మరలా మరో ఇల్లు కట్టడం మొదలెడుతుంది.

పేపర్ వాస్ప్ (Paper Wasp) అనే కాగితం కందిరీగ చెట్లు బెరడును బాగా నమిలి దానితో కాగితం తయారు చేస్తుంది. ఈ కాగితంతో ఆరు కోణాలుండేగదులు గల ఒక చిన్న భవంతి నిర్మిస్తుంది. ఒక్కో గదిలో ఒక గ్రుడ్డు పెడుతుంది. పిల్లల సంఖ్య పెరిగే కొద్దీ ఈ కాగితపు హర్మ్యం పెద్దదవుతుంటుంది. వీటిని మీరు ఇళ్ళ చూరునో, చెట్ల కొమ్మలకో అతుక్కొని వుండటం చూసే ఉంటారు.

ఇదే రకపు షట్కోణాకృతి గల గదులున్న ఇళ్ళను తేనెటీగలు కూడా తయారు చేస్తాయి. తేనెపట్టు తయారీకి అవసరమైన మైనం తేనెటీగ శరీరంలోని మైనపు గ్రంధులు ఉత్పత్తి చేస్తాయి. 55 గ్రాముల 'తేనెటీగ మైనం' ఉత్పత్తి చేయటానికి తేనెటీగలు ఒక కిలో తేనె త్రాగాలి. ఒక మధ్యరకం తేనెపట్టు తయారు చేయటానికి ఏడు కిలోల తేనె అవసరం. ఒక ప్రదేశంలో అతి ఎక్కువ గదులు నిర్మించాలంటే అవి ఆరు కోణాలతో ఉండాలట. మనకు ఈ లెక్క తెలిసినా మనం నాలుగు కోణాలుండే ఇళ్ళు కట్టుకుంటాం. తేనె టీగలు తేనె కారిపోకుండా దాని గదులు మూలనుంచి 13 డిగ్రీలు పైకి వాలుగా నిర్మిస్తాయి.

చెత్త తినేవి చెదలంటూ మనం తేలిగ్గా తీసివేస్తాం. కాని చెదలు భూమ్మీద అద్భుతమైన కట్టడాలు నిర్మిస్తాయి. వాటి కట్టడాలన్నీ మట్టి, చెక్క, వాటి విసర్జక పదార్థాలతో తయారౌతాయి. చెద పురుగుల శరీర పరిమాణంతో పోలిస్తే అవి నిర్మించే పుట్ట కొన్ని వేల రెట్లు పెద్దదిగా ఉంటుంది. మానవుని

ఆకాశహార్మ్యలును ఇవి త్రోసి రాజంటాయి. ఏడు నుండి 30 అడుగుల వరకు ఎత్తు, దాదాపు ఏడడుగుల వరకు వెడల్పుండే అత్యంత పెద్ద చెద పుట్టలు కూడా భూమ్మీద ఉన్నాయి.

చెదపుట్ట మధ్యలో అంతఃపురం ఉంటుంది. దానిలో ఉండే రాణి తన పిల్లల కంటే ఆరువేల రెట్లు పెద్దదిగా సుమారు ఆరంగుళాల పొడవుంటుంది. అంతఃపురానికి క్రిందుగా చెదపురుగులు పెంచే ఫంగస్ తోటలుంటాయి. వర్షాకాలంలో ఈ తోటల నుంచే పుట్ట గొడుగులు బయటకు వస్తాయి. అంతఃపురంపైన అవి ఆహారాన్ని దాచుకునే గోదాములుంటాయి. పుట్ట లోపలి వేడి ఎప్పుడూ ముప్పై డిగ్రీలు మించదు. అందువలననే ఈ చెదల పుట్టల్లోకి ఇతర జీవులు అనుమతి లేకుండానే అతిథులుగా వచ్చి చేరతాయి.

ఆస్ట్రేలియాలో నివసించే కింగ్ ఫిషర్ అనే పక్షి (Kingfisher) చెద పుట్టలో 14 అంగుళాల రంధ్రం చేసి గుడ్లు పెడుతుంది. ఎన్నిసార్లు చెద పురుగులు రంధ్రాన్ని మూసేసినా కింగ్ ఫిషర్ రంధ్రం చేస్తూనే ఉంటుంది. విసిగిపోయిన చెదలు ఆ రంధ్రాన్ని అలాగే వదిలేస్తాయి.

మానిటర్ లిజర్డ్ (Moniter Lizard) అనే తొండ జాతి జీవి గుడ్లు పెట్టాలంటే దానికి చెద పుట్ట కావాలి. చెద పుట్టలో రంధ్రం చేసి గుడ్లు పెడుతుంది. చెదలు రంధ్రాన్ని మూసేస్తాయి. తొమ్మిది నెలల తర్వాత పిల్లలను చెద పుట్ట నుండి బయటకు తీయటానికి మాత్రమే మానిటర్ లిజర్డ్ మరలా వస్తుంది.

అలాగే ఆఫ్రికాలోని 'బోట్సువానా' లోని గబ్బిలం చెవులనక్క (Bat Eared Fox) పగలు వేడి నుండి కాపాడుకోవటానికి చెద పుట్టను ఒకవైపు నుండి త్రవ్వి ఇల్లుగా మార్చుకుంటుంది.

పీతలు సముద్రపు ఒడ్డున, చెరువుల ఒడ్డున బొరియలు చేసుకు నివసిస్తాయని మనకు తెలుసు. 'ఋషి పీత' (Hermit Crab) ఖాళీ నత్తగుల్ల నొకదాన్ని ఎన్నుకుని దానిలో స్థిరపడుతుంది. దాని శరీర భాగాలు కూడా నత్త గుల్ల ఆకారానికి తగ్గట్లుగా మారిపోతాయి. స్వంతంగా తయారు చేసుకోలేనప్పుడు ఉన్నదాంతో సర్దుకోవటమే మంచిదని ఋషి పీత నేర్చుకుంది. అంతే కాదు తనకు మరింత రక్షణ కోసం 'సీ అనిమొన' (Sea Anaemone) అనే విషపూరితమైన కుట్టు కణాలుండే జీవిని తన అద్దె ఇంటి కప్పుపై అతికిస్తుంది.

సాలె పురుగులు తమ పొట్ట క్రింద ఉన్న గ్రంథిలోంచి వచ్చే ద్రవం గట్టిపడటం వలన ఏర్పడే దారంతో గూడు అల్లుతాయి. చిన్న సాలెగూట్లో సుమారు 20 మీటర్ల దారం, 1000 జంక్షన్లు ఉంటాయి. కేవలం అరగ్రాము బరువుండే సాలెగూడు, తనబరువుకు 4000 రెట్లు బరువు ఆపగలుగుతుంది. సాలెగూడు రేఖా గణిత సూత్రాలకు అనుగుణంగా ఉంటుంది. (లెక్కల సాలెపురుగులు (Mathematical Spider) ఖచ్చితంగా వృత్తాకారంగా ఉండే విధంగా తాళ్ళు అమరుస్తాయి)

చీనాంబరాలుగా ప్రసిద్ధి చెందిన పట్టు బట్టలు, పట్టు పురుగు డింభకదశ లాలాజలమే. పట్టు పురుగు డింభకం నిద్రపోవటానికి గాను లాలాజలంతో గూడు అల్లుకుంటుంది. ఈ లాలాజలం గాలి తగలగానే గట్టి పడుతుంది. నిద్రపోయే పురుగును లోపలే చంపి దారం మనం వాడుకుంటాం.

మలేసియా, బోర్నియాలలో నివసించే స్విఫ్ట్ (Swift) అనే పక్షులు తమ లాలాజలంతో గూడు కడతాయి. అయితే ఈ గూట్లో అది ఇంకా గ్రుడ్లు పెట్టకముందే మానవులు ఆ గూళ్ళను తీసి వాటితో రుచికరమైన 'సూప్' (Soup) లు తయారు చేసుకుంటారు.

ఇలాంటిదే మధ్య, దక్షిణ అమెరికాలలో ఉండే కేయని అనే పక్షి లాలాజలం, ఈకలు, మొక్కలతో కలిపి మేజోడు లాంటి గూడు కడుతుంది.

ఐరోపా నీటి సాలీడు (European Water Spider) నీటి అడుగున మొక్కలు ఆధారంగా ఒక పల్చటి బట్ట వంటి పొరను అల్లుతుంది. సాలీడు నీటిపైకి వచ్చి ఒక గాలి బుడగను తన పొట్ట క్రింద పట్టుకుని లోపలకు తీసికెళుతుంది. గాలి బుడగను పొరకింద వదులుతుంది. అలా చాలా సార్లు చేయటం వలన గాలి చేరి పొర బుడగ లాగా అవుతుంది. నీటి అడుగున గాలి బుడగలో ఉండి సాలె పురుగు వేటాడ్డం, గ్రుడ్లు పెట్టడం, పిల్లల్ని పెంచటం చేస్తుంది.

'తాపానికి గురైన వాళ్ళను తామరాకులతో కప్పి ఉపశమనం కలుగజేస్తారట'. పుట్టల్లో ఉండే చీమల గురించి మనకు తెలిసిందే. చెట్లమీద నివసించే 'పొత్రం చీమలనే' ఎర్ర చీమలంటారు. ఇవి చెట్ల ఆకులను దగ్గరగా చేర్చి లార్వాల శరీరం నుంచి వెలువడే జిగటగా ఉండే ద్రవంతో ఆకులను అతికించి గూడు తయారు చేస్తాయి. ఆకుల మధ్యలో పిల్లలను, కోశాలను ఉంచుతాయి. ఆకుల మధ్య ఎలా వుంటుందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదనుకుంటాను.

దర్జీపిట్ట (Tailor Bird) కూడ ఇలాగే ఆకులను దగ్గరకు చేర్చి, ఆకులకు ముక్కుతో రంధ్రాలు చేసి నారతోనో, దారంతోనే కలిపి కుడతాయి. మధ్యలో మెత్తటి పీచు, ఈకలను, చేర్చి మెత్తను తయారు చేస్తుంది. హంస తూలికా తల్పం గురించి వినటమే గాని - వాడిన వాళ్ళుండరు. కాని పక్షుల గూళ్ళలో చాలా భాగం ఈకలతో నిర్మితమైనవే.

ఎడారుల్లో నివసించే జీవులు పగటి వేడి నుంచి తప్పించుకోవటానికి భూ గృహాలు తప్ప వేరే మార్గం లేదు.

పశ్చిమ ఆస్ట్రేలియాలో నివసించే చిట్టెలుక (Pebble mound mouse) కలుగు ముఖ ద్వారం వద్ద 3 చదరపు మీటర్ల వైశాల్యంలో చిన్న చిన్న రాళ్ళతో గుట్ట నిర్మిస్తుంది. రాత్రి వేళల్లో నీటి బిందువులు, రాళ్ళ పై పేరుకుంటాయి. ఆ నీటిని ఎలుక స్వీకరిస్తుంది. పగలు వేడికి నీరు ఆవిరై కలుగులోపలికి చల్లని గాలి ప్రసరిస్తుంది.

ప్రపంచంలో అతి ఎత్తుగా పెరిగే సుగువరోక్టాకస్ (Suguarocactus) అనే ఎడారి మొక్క కాండాన్ని తొలిచి వడ్రంగి పిట్ట గూడు ఏర్పాటు చేసుకుంటుంది. వడ్రంగి పిట్ట గూటిని వదలి వేసిన తర్వాత

'నట్ హేచ్' అనే పక్షి దానికి మట్టితో మరమ్మత్తులు చేసుకుని నివసిస్తుంది. వడ్రంగి పిట్ట వదలిన గూళ్ళను గుడ్లగూబలు కూడా ఆక్రమిస్తాయి.

ఎలుక జాతికి చెందిన మోల్ అనే అడవి ఎలుకలు 200 గజాల పొడవైన సొరంగాలు త్రవ్వుతుంది. మధ్య మధ్యలో గాలి కోసం పైకి రంధ్రాలు చేస్తుంది. ఈ రంధ్రాల ద్వారా లోపలకు పడిన పురుగులను పట్టి తింటుంది.

ఆఫ్రికా, ఇంగ్లండ్‌లలో నివసించే బాడ్జర్ అనే జీవి కలుగు చాలా పురాతనమైనవై వుంటాయి. ఇంగ్లండులో 200 సం॥ నాటి బాడ్జర్ కలుగును కనుగొన్నారు. 2000 చదరపు గజాల విస్తీర్ణం గల ఈ కలుగుకు 30 ద్వారాలున్నాయి. రాత్రివేళ సంచరించే ఈ జీవులు ప్రతిరోజూ మెత్తని గడ్డితో పడక సిద్ధం చేసుకుంటాయి.

స్థిర నివాసం లేక పోయినా చింపాంజీలు రాత్రివేళ పడుకోవటానికి పడక సిద్ధం చేసుకుంటాయి. మెత్తగా వంగే కొమ్మలను వంచి వాటిమధ్యలో ఆకులతో మెత్తని పడక తయారు చేసుకుంటాయి.

అలాగే గొరిల్లాలు కూడా పడక ఏర్పాటు చేసుకుంటాయి. అయితే వాటి శరీరం బరువు 250 కిలోల వరకు ఉంటుంది కాబట్టి నేలపైనే చెట్లు మొదట్లో గడ్డి పరచుకుని పడుకుంటాయి. ఆవులు, గేదెలు, ఎద్దులు కూడా రాత్రివేళ గడ్డి పరచుకుని పడుకోవటం వ్యవసాయదారులకు తెలిసిందే.

'చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరవైనయట్లు' అంటూ శతకకారుడు పాములకు పుట్ట తయారు చేసుకోవటం రాదన్నాడు. కాని 'కింగ్ కోబ్రా' (King Cobra) అనే రాచనాగు ఆకులు దగ్గరగా చేర్చి అందులో గ్రుడ్లు పెడుతుంది. గూడుకట్టే పాము ఇదొక్కటే.

ఎడారి జీవులకు వేడి ఎక్కువై ఇబ్బంది. అదే ధృవప్రాంతపు జీవులు చలి ఎక్కువై బాధపడతాయి.

ధృవపు ఎలుగుబంటి శీతాకాలంలో రెండు గజాల పొడవున్న సొరంగం త్రవ్వి దానిలో కొంచెం ఎత్తుగా వుండే అరుగు నిర్మిస్తుంది. ఎలుగు శరీరం నుండి వచ్చే ఉష్ణం దాని గుహను బయటికంటే (21°) ఇరవై ఒక్క డిగ్రీలవరకు ఎక్కువ వేడిగా ఉంచుతుంది.

'ఇల్లు చూసి ఇల్లాలిని చూడమని' సామెత.

కాకిగూటిని చూసిన తర్వాత కాకమ్మను చూడనవసరం లేదనుకుంటాను. అదే గిజిగాడు గూటిని అతి నేర్పుతో నిర్మిస్తుంది. ఈ గూడు చెట్టుకు వేలాడటం వలన పరభక్షులు దాన్ని చేరలేవు. గూట్లో పిల్లలకోసం ఒక గది తనకోసం మరో గది నిర్మిస్తాయి. ఇంతకీ ఈ గూటిని నిర్మించేది మగ పక్షులే.

ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కో జీవి ఇల్లూ ఒక్కోరకం. ఇల్లు ఎంత చిన్నదైనా సౌకర్యంగా వుండటం ముఖ్యం. ఇంట్లో పిచ్చుకల గూటినో, పెరట్లో కాకి గూటినో పీకి బయట పడేసేముందు అది వాటి ఇల్లనీ, ఒకసారి తీసేస్తే మరలా కట్టుకోవటనాకి ఎంతో సమయం పడుతుందనీ మనం ఒక్కసారి ఆలోచిస్తే వాటికి శ్రమ తగ్గించినవారమవుతాం. కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే మనకూ వాటి గురించి ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఏమంటారు?

(ఆకాశవాణి అనంతపురం కేంద్రం ద్వారా ప్రసారితం)

# బింబ ప్రతిబింబాలు, సామాజిక అస్తవ్యస్తత - విలోమ కథలు

- ముంగర జాషువ

జీవితం కథకాదు - కథకన్నా గొప్పది జీవితం;
జీవితంలోని అన్ని పార్శ్వాలను వ్యక్త పరచలేదు కథ -
కథే కాదు ఏ కళా ప్రక్రియా అభివ్యక్త పరచలేదు; ఎందుకంటే జీవితం 'అనంతం' గనుక!

కథ, కవిత, పాట, నాటకం లాంటి సాహితీప్రక్రియలే కాకుండా మిగతా కళారూపాలు కూడా, వైయక్తిక, సామాజిక జీవితాన్ని విభిన్న కోణాల నుండి వ్యక్తపరచాలని ప్రయత్నిస్తాయి. కొంతవరకు, కొందరు రచయితలు, కళాకారులు సఫలు లౌతారు. కొందరు అసఫలు లౌతారు. కవిత్వంలో, కథల్లో నగ్నముని సఫల సాధకుడే!

నగ్నముని 'విలోమ కథలు' వ్రాసి 26 సంవత్సరాలు గడిచినవి. వస్తువు, రూపం పాతబడి పోకుండా ఈనాటికీ, కథలు చదివిస్తున్నాయంటే, అందుకు రెండే కారణాలు; ఒకటి రచయిత ప్రజ్ఞా జీవి కావడం, ఇంకొకటి, దేశ, కాలాల్లో, సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో మార్పులేక పోవడం!

ఈనాడే కాదు, అన్ని కాలాల్లో రాజనీతి శాస్త్రం, 'రాజకీయంగా' పరిణామం చెందింది. ప్లేటో 'రిపబ్లిక్' మొదటి ప్రకరణంలో, సోక్రటీస్‌తో, 'థ్రాసిమాకస్' అనే తత్త్వవేత్త ''న్యాయమంటే బలవంతుల ప్రయోజనమని;'' ''న్యాయమనేది బలవంతుడైన పాలకుని శ్రేయస్సు'' అనే సూత్రాలతో తలపడి వాదిస్తాడు. అయితే 'థ్రాసిమాకస్' ఓడిపోయినా, అతని ప్రతిపాదిత సూత్రాలు, ప్రపంచం అంతా, ఇప్పటికీ రాజ్యం చేస్తున్నాయి. ఓడిపోయిగెలవడం అంటే ఇదే !

'రిపబ్లిక్' లో సోక్రటీస్‌తో చర్చించి ఓడినా 'థ్రాసిమాకస్' ప్రతిపాదిత సూత్రార్థం 'బలవంతుడు తన స్వప్రయోజనానికి ఏర్పరుచుకొనేది, చట్టం, న్యాయం' అనేవి, భారత్‌లో 1975 ఎమర్జన్సీ కాలంలో, నిజమై రుజువైనాయి. ఆ సమయంలో, అర్థాకలితో జీవించే వర్గాల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అణచి వేయడం జరిగింది. ఆ తరుణంలో 'నగ్నముని' లాంటి మేధోరచయిత విలోమ కథలను 'కథాస్త్రాలుగా' సంధించడం జరిగింది; రాజకీయ వ్యవస్థపైకి.

విలోమ కథల్లో మొదటి కథ పేరు చాలా దీర్ఘంగా వుంటుంది. ''ఇందు మూలంగా సమస్తమైన వారికీ మన ముఖాలు, కాళ్లు, చేతులూ, వగైరా సర్వాంగాలను గురించి తెలియజేయడమేమనగా'' అనేది. కథా లక్ష్యంగూడా ముందుగా చెప్పడం క్రొత్తగా వుండి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇదొక టెక్నిక్. ఈ కథలో రచయిత: ''అందరి ముఖాల్లోకి పరిశీలనగా చూశాను. షాక్ కొట్టినట్లయింది. చాలా మందివి వాళ్ల ముఖాలు కావు. కొందరు మొగాళ్ళకి ఆడ ముఖాలు, కొందరు ఆడాళ్ళకి మగముఖాలు,

---

ముంగర జాషువ, కెనాల్స్, హిల్‌కాలని , నల్లగొండ జిల్లా.

కొందరివి గాడిద ముఖాలు, కొందరివి ఎలుగుబంటి ముఖాలు, కొందరివి కప్ప ముఖాలు. ఇట్లా చాలా మంది మనుషులు జంతువుల ముఖాలు తగిలించుకొని తిరిగేస్తున్నారు. వ్యాపారాలు, ఉద్యోగాలు, రాజకీయాలు చేస్తున్నారు. పదవుల్లోకి పోకేస్తున్నారు.'' అని అంటారు, వ్యంగ్యంగా!

ఈ కథ సరళంగా కనిపించినా, అసాధారణమైంది. మనిషి తన ముఖంతో గాక, ఎవరి ముఖంతోనో జీవిస్తున్నాడని, సమాజంలో ఎక్కువ మంది, మనుషులు, మనుషులుగా కాక జంతుప్రవృత్తితో జీవిస్తున్నారని స్పష్టం చేస్తాడు రచయిత! జంతు ప్రవృత్తి వున్నవాళ్లు, ఉద్యోగాలు, వ్యాపారాలు, రాజకీయాలు చేస్తే సమాజం ఏపతనావస్థలో వుంటుందో పాఠకుడి ఊహకే వదిలి పెట్టడం జరిగింది.

సమాజంలో మనిషి తన ముఖంతో బ్రతకక పోవడానికి ప్రధానకారణం, భయం ... భయం... భయం.. నిజాన్ని చెప్పలేని, అంగీకరించ లేని భయం. ఇటువంటి భయానక వాతావరణం, వ్యక్తిలో మేటవేసుకొని లౌక్యాన్నో, పలాయన వాదాన్నో, అవకాశవాద తత్త్వాన్నో, అడ్డుపెట్టుకొని జీవించడం జరుగుతుంది. ఇందువలన, మనిషిలోని సాంఘిక ప్రవృత్తి (social behaviour) పూర్తిగా పరాధీనతను పొంది, తన యొక్క వాస్తవ రూపాన్ని గ్రహించడం లేదని, ఈ అసహజ మనస్తత్వం (abnormal psychology) వ్యక్తిగత జీవితాన్ని కలుషితం చేస్తుందని, నగ్నముని ఆవేదన చెందడం, బింబ ప్రతిబింబంగా ద్యోతక మౌతుంది!

మొదటి కథ 'ఇందు మూలంగా ... చదివిన తరువాత margin లో ఈ విధంగా వ్రాశాను. "The individual of the society is wearing the mask of another person without any shyness, fearness, frankness, so, it should be removed and demolished at first instance" అని. పాఠకుడిలో ఇలాంటి ప్రతి స్పందన కలిగించడం సాహిత్య కళా ప్రయోజనాన్ని సాధించడమే!

ఈ 'విలోమ కథలకు' నేపథ్యం, భారత ప్రజానీకం, నియంతృత్వపు కోరల్లో చిక్కుకున్న సమయం. 1975 అత్యయిక పరిస్థితిని ఆంధ్రప్రదేశ్‌లో కొంతమంది అత్యుత్సాహవంతులైన కవులూ, రచయితలు 'వామపక్ష నియంతృత్వంగా'' కీర్తిస్తున్న సమయంలో ''ఒకే ఒక్క నగ్నముని కలం'' ఎదురు తిరిగింది. కొన్ని పరిమితులకు లోబడి రచన సాగటం వలన, విలోమ కథల్లో, వస్తు ప్రధానం, అతిక్లుప్తత, అస్పష్టత, శిల్ప దృష్టి కొంత తగ్గడం, వ్యంగ్యం, సంస్కరణ వాదం లాంటి positive and negative elements చోటు చేసుకొన్నాయి.

''మహాకవి'' ఏది వ్రాసినా గొప్పదనే తత్త్వం
అన్నీ మా మత గ్రంథాల్లో ఉన్నాయనే తత్త్వంలాంటిదే''

మహాకవి, మహారచయిత కూడా సామాన్యార్థంలో మానవులే. వారిలో ఏ దోషాలు ఉండవనటం సరికాదు. అయితే అవి పరిగణన చేయవలసినవి కావు!

ఇకపోతే, రెండవ కథ 'పులి-బెబ్బులి' అనేది. ఆవు తలతో పులి మనిషి నాగరిక సమాజంలో చెలామణి కావడం, ఈ కథలో విశేషం. ఎక్కువ భాగం రాజకీయాల్లో, వ్యాపార వర్గాల్లో వున్న వ్యక్తుల నిజ స్వరూపం, పులి స్వభావం కన్నా అన్యం కాదని, ఆవు తల వెనుక వున్న క్రూరత్వాన్ని, కర్కశత్వాన్ని, మానవతా రాహిత్యాన్ని విలోమవిలువల్లో బ్రతికే జీవన విధానాన్ని గ్రహించడానికి, పాఠకుడికి ఒక క్రొత్త కోణాన్ని అందిస్తారు రచయిత ఈ కథలో!

మూడవ కథ ''శిశుహత్య'' కూడా ఎంతో వైచిత్రి కలిగి వుంటుంది. ఇందులో మూడు ప్రధాన పాత్రలు. ఒకటి చిరుద్యోగి విఘ్నేశ్వరావు, నిత్య దరిద్రంలో మునిగిపోయి నడుస్తున్న శవం. రెండో పాత్ర కూలీల, చిరుద్యోగుల రక్తం పిండి సంపాదించే వడ్డీ వ్యాపారి కత్తుల కనకమ్మ. సాటి స్త్రీ వంటి మీద చీర తాకట్టు పెట్టుకొని వ్యాపారం చేసే వ్యక్తి. మూడవ పాత్ర గర్భస్థ శిశువు, ఈ వ్యవస్థలోకి అడుగుపెడదామా? వద్దా? అనే సందేహ జీవి!

ఈ కథలోని చిరుద్యోగి ప్రధానంగా అదృష్టాన్ని నమ్ముకోవడం. నాలుగో కాన్పుకి 'మగపిల్లవాడు' పుడతాడనే **gender complex** తో వుండటం. ఇల్లు గడవక చేతి వాచీ తాకట్టు పెట్టుకొనే దారిద్ర్యం. కనీసం సినిమా అయినా చూపించి భార్యను సంతోష పెట్టాలనే తాపత్రయం. అంతులేని పిరికితనం భయం లాంటి లక్షణాలతో చిరుద్యోగి రూపాన్ని, దిగువ మధ్య తరగతి బడుగు జీవుల వ్యథాభరిత జీవనాన్ని చక్కగా చిత్రీకరించారు నగ్నముని!

ఈ 'శిశుహత్య' కథలో గర్భస్థ శిశువు, తన తండ్రి అయిన చిరుద్యోగితో మాట్లాడటం, ఒక అధివాస్తవిక ధోరణి. ఆ గర్భస్థ శిశువు తండ్రితో మాట్లాడి కులమతాల కుళ్లుగురించి, తను పుట్టబోయే కుటుంబ దరిద్ర వాతావరణాన్ని గురించి తెలుసు కుంటుంది. తరువాత చిరుద్యోగి భార్యకు **abortion** అవుతుంది. ఇక్కడ శిశువు పుట్టక పోవడానికి కారణం, వ్యవస్థ లోటుపాట్లను తెలుసు కోవడం, రెండవది దుర్భర దారిద్ర్యాన్ని భరించలేననే నిర్ణయానికి రావడం కూడా కారణాలే అయినప్పటికీ, ప్రధానంగా అస్తవ్యస్త పరిస్థితులలో మ్రగ్గుతున్న వ్యవస్థే ఈ 'శిశుహత్య' కు కారణమని రచయిత, తండ్రి పాత్ర ద్వారా స్పష్టం చేయడం సహజంగా, సమంజసంగా వుంది.

ఈ కథ చదివిన తరువాత మనకు తెలిసిన వ్యక్తులు, పరిస్థితులు, కళ్ల ముందు దృశ్యమాలికలుగా సాగిపోతున్నట్లనిపిస్తుంది. పాఠకుడి మనసు, భారంగా 'వేదనాశకలంగా' మిగిలిపోతుంది. ప్రముఖ కవి 'దేవిప్రియ' అన్నట్లు ''సామాజిక వాస్తవాల చేదును భరించలేని వారికి నగ్నముని విలోమ కథలు విషగుళికలే ఔతాయి. ఈ 'శిశుహత్య' కథ కలిగించిన సంవేదనను గురించి రెండు వాక్యాలు వ్రాసుకొన్నాను. ఈ విధంగా :

''కనుగ్రుడ్లు రెండూ
రెండు కన్నీటి బొట్లయినాయి -
మనసు చెదిరి

వికావికలయి పీలికలయింది -
'మో' కవితలోని అస్పష్టనిశ్శబ్ద ఆవేదన
నన్నుచుట్టు కొన్నట్లయింది
విషసర్పంలా!''

ఇక నాలుగవ కథ ''లైకా-మజ్ను ప్రళయగాథ'' అనేది. స్థూలంగా, ఈ కథలో, దిగువ మధ్య తరగతికి చెందిన, కుక్కుటేశ్వరావు కుచేల సంతానంతో, తన స్థాయిలో వున్న మూడు కుటుంబాలతో కలసి అద్దె ఇంట్లో జీవించడంతో ప్రారంభమవుతుంది. అక్కడ సఖ్యతలేదు. కాలం వెళ్లదీస్తుంటారు. ఆ సత్రం లాంటి వాటాల్లో దొంగలు పడటంతో కాపలాకి ఊరకుక్కల సాంగత్యం కలిగిన జాతికుక్కని తెచ్చుకొని, 'లైకా' అనే ముద్దు పేరు పెట్టుకొంటారు. VIPని చూసినట్లు దాన్ని మంచిగా చూసుకొంటారు. అయితే, అది ఇంట్లో వాళ్లనే కరుస్తుంది. ఆ కుటుంబాలు, దాన్ని వదిలించుకోవడానికి తీర్మానించుకొంటాయి. కాని, అది వదల్లేదు. దానికొక ప్రియుడు కూడా వున్నాడు 'మొసలి' రూపంలో!

ఈ కథ ఒక ఆధునిక చిత్రం. కథ అంతా వర్ణచిత్రంలా వుంటుంది. నిపుణ చిత్ర కారుడు వేసిన చిత్రంలోని colour mixing, colour harmony గుర్తు కొస్తాయి. ఈ కథా చిత్రంలోని ప్రధానపాత్ర ''లైకా'', రాజకీయ వ్యవస్థకు ప్రతీక! అవసరం కొద్దీ తన genderని సైతం మార్చుకొనే స్థితిలో వుంటుంది. అది కాపురం చేసేది 'మొసలి' లాంటి పోలీసు వ్యవస్థతోటి! అందువలన, ఈ రెండింటి ఆజమాయిషీలో వున్న సామాన్యుల జీవితాలు ఏ విధంగా వుంటాయో, ఇక చెప్పనవసరం లేదు. సామాన్యులు, పీడితులు, న్యాయంకోసం ఎవరి దగ్గరికి వెళ్ళాలి. రాజకీయ వ్యవస్థ దగ్గరికా? పోలీసు వ్యవస్థ దగ్గరికా? ఒకటి 'లైకా' రెండోది 'మజ్ను' (మొసలి) రెండింటి అనుబంధమే ''లైకా-మజ్ను ప్రళయగాథ''!

ఈ కథకూడా నగ్నముని 'ప్రయోగ శీలత' కు దర్పణం లాంటిదే! మనోవైజ్ఞానిక పరిశోధనల్లో 'పావ్‌లోవ్‌కుక్క'' అనేది ప్రసిద్ధి చెందివుంది. కుక్క ప్రవర్తనపై, తద్వారా మానవుల ప్రవర్తనపై ఉద్దీపన (stimulus), ప్రతి స్పందన (response)ల గురించి పరిశోధన అది. అయితే నూతన ప్రయోగాలను మన పాఠకులు, మేధావులు, అంత త్వరగా స్వీకరించ లేరు గనుక 'నగ్నముని' సృష్టి 'లైకా'కి అంత ప్రాచుర్యం కలుగ లేదు. అయితే ప్రజాస్వామిక వ్యవస్థలోని, దుర్బలులు, పీడితులు, అణగ ద్రొక్కబడిన దళితులూ, తమ 'పాలితుల్ని తామే ఎన్నుకొని, 'లైకాలు'గా ఏర్పరుచుకొని, తమ శ్రేయస్సుకు, తామే గండి కొట్టుకొని, దుర్భర దారిద్ర్యంలో జీవించడమనే, మానసిక పరిస్థితిని గురించి వ్రాసిన, పరిశోధనాత్మక కథ ''లైకా - మజ్ను ప్రళయగాథ!

'లైకాని' ఎమర్జన్సీతో పోల్చినప్పటికీ, అప్పటి ప్రత్యక్ష నియంతృత్వపు లక్షణాలు, అన్ని కాలాల్లోను పరోక్షంగా వుండి సామాన్యుల జీవితాలను, దుర్భరం చేస్తున్నాయి. అనే సందేశాన్నిస్తుంది, ఈ కథ!

'అయిదో కథ 'సిమెంటు సంతతి' లో వస్తువు పాతదయి నప్పటికీ చెప్పిన తీరు విశిష్టంగా వుంది. ఇది మోసపోయిన ఒక బాలిక కథ. ఈ కథలో రచయిత రాజకీయ నాయకుని విగ్రహాన్ని ప్రస్తావన చేసి, వాళ్ల సంతతి ఇంకా సమాజాన్ని అన్ని విధాలా నాశనం చేస్తుందనే స్పృహను కలిగిస్తాడు. కవితా ధోరణిలో సాగి, పాఠకుల హృదయానికి హత్తుకొనే విధంగా వుంటుంది.

ఇక పోతే, విలోమ కథల్లో చివరికథ 'గ్రహణం'. ఈ కథ చదివిన తరువాత విఖ్యాత చిత్రకారుడు, పికాసో ప్రసిద్ధ చిత్రం 'గుయెర్నికా' జ్ఞాపకం వచ్చింది. ఈ గుయెర్నికా చిత్రంలో పికాసో యుద్ధానంతర భీభత్సాన్ని, తెగిపోయిన ఎద్దుతలలతో, గుర్రం తలలతో విశిష్టంగా చిత్రించాడు. అలాగే ఎమర్జన్సీ భీభత్సాన్ని నగ్నముని చిత్రీకరించిన పెద్ద కథ 'గ్రహణం'!

దేశానికి పట్టిన 'గ్రహణాన్ని' నగ్నముని ప్రయోగశీలత విశ్వరూపంలో సాక్షాత్కరింప జేస్తుంది. ఇందులో కాకుల్నీ, కోకిలను, మత్స్యాలను, మకరాలను, అంగట్లో ఆత్మల్ని, పేడతట్టల్నీ, ఉష్ట్రపక్షుల్నీ, సమర్థవంతంగా ప్రతీకలుగా ఉపయోగించారు. ఈ ప్రతీకాత్మ కథ 'ఎమర్జన్సీ' సందర్భాన్ని బట్టి ఎంచుకోవలసి వచ్చింది. ఈ కథలో 'కుహనా ప్రజాస్వామ్యాన్ని' పాతి పెట్టాలనే ప్రయత్నం సమర్థవంతంగా జరిగింది. ఈ 'గ్రహణం' కథలోకి పూర్తి సమీక్షా దృష్టితో ప్రవేశిస్తే ప్రత్యేక వ్యాసం వ్రాయవలసి వస్తుంది. అందువలనే సంక్షిప్తత!

'కళ' అంతిమ లక్ష్యం కేవలం ఆనంద పరచడం కాదు. ఆనందపరచడం కూడా ఒక మానసిక ప్రయోజనమే అయినప్పటికీ 'కళ' అక్కడ నుంచి సంవేదనను పొందే దశకు, ఆలోచింప జేసే దిశకు, తుదకు వ్యక్తికీ, సమూహానికి 'ధర్మక్రోధాన్ని' కలిగించే స్థితికి పరిణామం చెందింది. ఇటువంటి మార్పులు అవగాహన చేసుకొన్న 'నగ్నముని' విలోమకథల్లో గుప్పించిన సంఘర్షణ, వ్యంగ్యమూ, ధ్వనీ, వర్ణనా రీతిలాంటి లక్షణాలు, పాఠకుడి అంతశ్చేతనను, అతలాకుతలం చేస్తాయనడంలో సందేహంలేదు.

'నగ్నముని' విలోమ కథలను చదివేటప్పుడు, వాటిని గురించి ఆలోచించేటప్పుడు, విఖ్యాత తత్త్వవేత్త బెర్ట్రాండ్ రస్సెల వ్రాసిన వాక్యం ఒకటి జ్ఞాపకం వచ్చింది. ఆ వాక్యంతో ముగిస్తాను, ఈ వ్యాసాన్ని. ఆయనంటారు, "We shall understand both these better, it we have considered first how the world acts upon us and how we act upon the world".

ఇటువంటి తాత్త్విక సూత్రాలను (philosophical principles) అవగాహన, ఆవాహన చేసుకొన్న రచయితగా కన్పిస్తారు, నగ్నముని!

ఆధునిక సాహిత్యంలో పునర్జాగృతికి (Renaissance) కారకులైన కవుల్లో, రచయితల్లో 'నగ్నముని' ప్రథముడు!

# మంచితనాన్ని మించిన మనిషి

– 'శ్రీ విరించి'

విశాఖపట్టణనంలో ఓ వకీలు గారున్నారు. ఆయన్ను గురించి అందరూ మంచిగా చెప్పేవాళ్లే. ఆయన పేరు మొదటగా ప్రస్తావన చేసిన మనిషి లుబ్ధావధాన్లు. 'సౌజన్యరావు పంతులు దేవుడు. ఆయనలాంటి వాళ్లు వుండబట్టే వర్షాలు కురుస్తున్నాయి. ఆయన శలవిచ్చినట్లు తప్పంతా నాయందు వుంచుకుని విధిని నిందించడ మెందుకు? ... ఒక్క సౌజన్యరావు పంతులు సత్య సంధుడులా నాకు కనపడుతున్నాడు-' అంటాడు యితను ఆరో అంకం నాలుగవ స్థలంలో.

ఇది 'కన్యాశుల్కం' నాటకంలో జరిగిరిన తతంగం. ఆ నాటకాన్ని గురించి ఎన్నో తర్జన భర్జనలు యీ సరికే జరిగాయి. వాటినన్నిటినీ తడమడమో, సమాధానం చెప్పటానికి ప్రయత్నం చేయడమో యీ చిన్న వ్యాసం వుద్దేశ్యం కాదు. 'సౌజన్యరావు' అనే 'మాదిరి పాత్ర' ఎలా సంఘ సంస్కరణ చేయగలుగుతుందో అర్థం చేసుకుందుకే యీ ప్రయత్నం.

ఆయన నాటకంలో ప్రవేశించేటప్పటికే 'లుబ్ధావధాన్లు'ను మార్చి వేశాడు. పైని చెప్పిన స్వగతంలోనే లుబ్ధావధాన్లు తన తప్పిదాలను ఏకరువు పెట్టి (1. ఒక్కగానొక్క కూతుర్ని ముసలి వాడికి అమ్మడం 2. ముసలితనంలో పెళ్లి చేసుకుందామని ప్రయత్నించడం, 3. దొంగ ముండకొడుకు అని తెలిసీ రామప్పంతుల్ని నమ్మడం, 4. 'మాయగుంట' కూనీ కేసులో యిరుక్కోవడం), తన భవిష్యత్ కార్యక్రమం కూడా నిర్ణయం చేసుకుంటాడు: 1. మీనాక్షిని వితంతువుల మఠంలో చేర్పించి, అవసరం అయిన డబ్బు యివ్వడం, 2. తాను కాశీ వాసానికి వెళ్లిపోవడం.

ఈ అంకం - స్థలంలో పరిచయమే కాకుండా, ప్రత్యక్షం కూడా అవుతాడు సౌజన్యరావు. రామప్పంతులు లుబ్ధావధాన్లుతో మళ్లీ భేటీ అవుతూ వుంటే దేవుడిలా వచ్చి 'నీ సంగతి నాకు తెలుసును. అవతలికి నడువు', అని ఆజ్ఞ యిస్తాడు. రామప్పంతులు సౌజన్యరావును ముఖం మీదనే స్తుతిస్తాడు. 'తమరు ధర్మ స్వరూపులు ... అకారణమైన దయచేత యీ కేసులో పని చేస్తున్నారు... తమరు యోగ్యులూ, గొప్పవారు ...' అయినా ఆయన ముందు నించోగల యోగ్యత సంపాదించలేక పోతాడు.

కరటక శాస్త్రులకు మధురవాణి సలహా యిస్తుంది; సహాయం చేస్తుంది కంటే వాపసు చేసి. ఈ శాస్త్రులుగారు సౌజన్యరావు పంతులును ముందే యెరుగుదురు. 'ఎవరో పోలీసు, తల్లి, కూరగాయలు పుచ్చుకుంటే, జుల్మానా వేశాట్ట; సౌజన్యరావు పంతులు అలాంటివాడు' - అంటాడు శిష్యుడితో. మధురవాణి ముందు కూడా 'ఆయన బహు న్యాయమైన మనిషి', అంటాడు. 'చాపలు యీదడానికి, పిట్టలు యెగరటానికి యేం కారణమో అదే కారణం' చేత లుబ్ధావధాన్లును కాపాడటానికి ఆయన విశ్వప్రయత్నం చేస్తూవున్నట్లు దాఖలా యిస్తాడు కూడా.

'అంత మంచి మనిషి మరి లోకంలో లేడు' అని ఆయన అన్నప్పుడు మధురవాణి తక్షణమే 'ఆయన్ని నాకు చూడాలనుంది, తీసికెళ్లారా?' అని అభ్యర్థిస్తుంది. అతను అంగీకరించడు. 'ఆయన నిన్నూ, నన్నూ యింట్లోంచి కఱ్ఱ పుచ్చుకు తరుముతాడు-' అంటాడు. ఆయన యాంటీ - నాచ్చి

---

డా॥ యన్.సి. రామానుజాచార్యులు, శ్రీవిరించిగా పేరు గాంచిన ప్రసిద్ధ కథకులు అడయార్ థియోసాఫికల్ సొసైటీ మద్రాసులో పని చేస్తున్నారు.

అని, కోప్పిష్టి కాదని చెబుతాడు. అయినా తనవల్ల యీ పని కాదని చెప్పక చెబుతాడు. మధురవాణి తన ప్రయత్నం తాను చేసుకోవలసి వస్తుంది. అందుకనే 'మగ' వేషం వేసి 'చరమాంకం' లో సౌజన్యరావు పంతులుగారి యింటి మేడపైన పంతులుగారి పడకగదిలోకే ప్రవేశిస్తుంది. నాటకానికి చరమ దశ తీసుకు వస్తుంది కూడా, అక్కడ అప్పుడు గిరీశం వుండడం వల్ల.

'పిల్లల్ని అమ్ముకోవడం శిష్టాచారం' అని మనసా వాచా కర్మణా నమ్మిన అగ్నిహోత్రావధన్లును మటుకు ఆయన మార్చలేక పోయినాడు. 'నామాట విని ఆస్తి యిచ్చివేసి ( బుచ్చమ్మకు), గిరీశం గారి మీద గ్రంథం చెయ్యడపు ప్రయత్నము మానుకుంటే, లుబ్ధావధాన్లుగారు మీమీద తెచ్చిన కేసు తీయించి వేస్తాను - మీ పిల్ల మీద దయా దాక్షిణ్యాలు లేకపోతే, స్వలాభమైనా ఆలోచించుకోండి-' అని సౌజన్యరావు చెప్పిన సలహాకు ఆ అగ్గిరాముడు చలించకపోగా, 'నీ యింట కోడి కాల్చా-' అని శపించి నిష్క్రమిస్తాడు.

'హెడ్డు' కానిస్టేబుల్ కూడా సౌజన్యరావుగారి గొప్పతనాన్ని, మంచి తనాన్ని 'బైరాగి' ముందు విశదపరుస్తాడు.

అగ్నిహోత్రావధాన్లనే కాదు, పోలిసెట్టిని గూడ 'కన్విన్స్' చేయలేకపోతాడు సౌజన్యరావు పంతులు.

'చదువుకున్నవాణ్ణి, బుద్ధిమంతుణ్ణి గనుక నీకు మంచి సలహా చెప్పమని సౌజన్యరావు పంతులుగారు నాతో మరీ మరీ చెప్పారు. -' అంటూ గిరీశం లుబ్ధావధాన్లు దగ్గర చేరతాడు. అప్పటికే అతను ఆయన దగ్గరకు తన 'గురువు'గారి నుంచి రికమెండేషన్ తీసుకు వచ్చి కాస్తో కూస్తో 'మాన్యుడు'గా చెలామణీ అవుతున్నాడు. గిరీశం యోగ్యతను గురించి సౌజనయరావు పంతులు దీర్ఘంగా మెచ్చుకోవడం యీ చివరి 'స్థలం' లో జరుగుతుంది. అందుకు కారణాలు: 1. గిరీశం ఎంత కష్టం, నష్ట వచ్చినా లుబ్ధావధాన్లును రక్షించటానికి ప్రయత్నం చేస్తాననడం, 2. లుబ్ధావధాన్లు వొప్పుకోకపోతే 'దత్తత' అయినా వదులుకుంటాను గాని 'బుచ్చమ్మ'ను ప్రాణ సమానంగానే చూసుకుంటాననడం. ('ఇది ట్రూ లవ్ మేరేజ్ కాని విడో మారియాజ్ కాదండి' అని ముందే చెప్పాడు.)

మారు వేషంలో సౌజన్యరావు పడకగదిలోనికి నేరుగా వచ్చిన మధురవాణిని చూచి నిర్ఘాంతపోతాడు గిరీశం. తరువాత - సందర్భానుసారంగా - తన సంగతి మాత్రం బయట పెట్టవద్దని ఆమెను ప్రాధేయపడతాడు.

'ఒకానొకరు లేని మంచిని కూడా వున్నట్టు ప్రచురపరిచి లోకాన్ని భ్రమింపచేస్తారు-' అని మధురవాణి సాక్షాత్తు గిరీశాన్ని గురించి సూచన యిస్తుంది. కాని ఆయన తన మంచి తనంతో యీ వ్యంగ్యాన్ని గమనించలేడు. 'మంచిగా వుందామని ప్రయత్నిస్తున్నాను. అంతకన్నా నాయందు యోగ్యత యేమీ లేదు...' అంటాడు సహజ వినయంతో. గిరీశాన్ని గురించి 'ఆయన యాంటినాచ్‌కి గురువు' అంటాడు. మధురవాణికి, సౌజన్యరావుకూ నడచిన సంభాషణలో అనేక విషయాలు ప్రస్తావనకు వస్తాయి. సౌజన్యరావు 'కోపాన్ని' గమనానికి తెచ్చి ఆయనచేత పరితాప పడేట్లు చేస్తుంది ఆమె. 'వుంచుకోవడం' మన్నించకపోతే, తనను వివాహమాడవచ్చునని కూడా ఆ మనిషి అభిప్రాయం' అని సవినయంగా - నర్మ గర్భంగా - చెబుతుంది.

మారు వేషం తీసివేషి, 'వూరు విజయనగరం; పేరు మధురవాణి' అని ఆమె స్వపరిచయం

చేసుకున్నప్పుడు, ఆయన 'యేమి మోసము జరిగినది!' అంటాడు; కోపావేశాన్ని ఆపుకుని. 'నా శత్రువులు యెవళ్లో నిన్ను నా దగ్గరికి పంపారు; అని ఆయన అన్నప్పుడు 'అల్లాగైతే తమ మంచే తమకు శత్రువైవుండాలి,' అని ఆమె వెంటనే సమాధానం చెబుతుంది. 'ముద్దు' తో కార్యం నిర్వహిస్తానని, తరువాత ఆ 'ముద్దు' కూడా వద్దని తిరస్కరిస్తుంది. 'తల్లిగారి ఉపదేశం' అలాంటిది, అంటుంది.

'ఆ పుస్తకం నేను చూడవచ్చునాండీ!' అనడుగుతుంది మధురవాణి, తాను వచ్చిన పని అంతా అయిపోయినాక. గిల్టు కవరూ, అందులోగల భగవద్గీత పుస్తకం ఆయన మంచం పక్కన రౌండ్ టేబుల్ మీద వుంది మొదటి నించీ.

మధురవాణి ఆ పుస్తకం పేరూ పలుకుతుంది. 'భగవద్గీత,' యిది మంచి వారు చదువే పుస్తకమా అండి?' అని అడుగుతుంది అమాయకంగా.

'ఇది చెడ్డవారిని మంచి వారిగా చేసే పుస్తకం' అంటాడు ఆయన.

'శ్రీ కృష్ణుడు తన్ను నమ్మిన వారితో అల్లా స్నేహం కడతాడు. పరమాత్మకు జాతి భేదం లేదు -' అంటాడు ఆయన. తరువాత 'సత్పురుషుడనే నామము సార్థకముగా గల యీ సత్పురుషుణ్ణి నీకు యిచ్చాను. ఆయన స్నేహం బలమైన కొద్దీ మా బోట్లను తలచవు' అంటాడు.

'మొన్నమొన్నటి దాకా' గిరీశం మధురవాణిని ఉంచుకున్నాడని విన్న మీదట సౌజన్యారావు పంతులు 'మంచి తనం' కొండెక్కిపోయింది.

'నెపోలియన్ ఆఫ్ యాంటి నాచ్' తనను గురించి దీర్ఘ పరిచయం చేసుకుని 'ఐ క్రేవ్ యువర్ మెర్సీ', అన్నప్పుడు కూడ ఆయనలో దాక్షిణ్యం కలుగదు.

'ట్రూ రిపెంటెన్స్' కాదు గిరీశానిది - అని ఆయనకు యెలా నిర్ధారణ అయిందో మనకు స్పష్టంగా వాచ్యం కాదు, యీ చరమాంకంలో. గిరీశాన్ని 'ఆషాడభూతి' అనడమే కాకుండా, గురువుగారితో సంబంధం తెంచివేస్తాననీ, అతన్ని బుచ్చమ్మను పెళ్లి చేసుకోనివ్వననీ ... మధురవాణిని 'మహోపకారం చేసినందుకు' కృతజ్ఞతగా ఆమెతో 'షేక్‌హేండ్' కూడా చేస్తాడు.

'డామిట్! కథ అడ్డం తిరిగింది' అని నిష్క్రమించడం తప్ప గిరీశానికి మరేమి మార్గం లేకుండా పోతుంది.


పేరులో మంచితనం, పెత్తనంలో మంచి తనం దానిని పెంచటానికే సర్వాత్మనా ప్రయత్నం చేయడం ఆయనలో మనకు కనిపిస్తుంది. మంచిని పెంచడమే కాదు, 'మించి' పోయిన మనషి కూడా యీయన, అనిపిస్తుంది.

ఆయన చరమాంకంలో మధురవాణికి యిచ్చిన బహుమతి, 'భగద్గీత' పుస్తకం ప్రపంచంలో 'మంచి తనం' పెరగటానికి ఉపకరిస్తుందని శ్రీ అప్పారావు పంతులుగారు చెప్పకుండానే చెబుతున్నారు. ఆయన మధురవాణినీ, గిరీశాన్ని కూడా మార్చివేశారు. చివరి సీమలో ఈ దృశ్యం మానవాళికి పదికాలాల పాటు పనికివచ్చే సందేశాన్ని యిస్తోంది. పుస్తకం అంతా చదవకుండా సప్తమాంకంలో 6వ స్థలం ఒక్కటే చదివినా (విశాలాంధ్ర వారి తొమ్మిదవ ముద్రణ సెప్టెంబర్ 2002లో పేజీలు 170-182) అప్పారావుగారి సౌజన్యం, సాంఘిక ప్రయోజనంతో సాన్నిహిత్యం స్పష్టంగా తెలిసివస్తాయి.



కేటలోనియా ప్రాంతంలోని ఫెగరస్ అనే డాలీ స్వంత ఊళ్లోఒక థియేటర్‌లోని మండువాలోగిలి పైకప్పుపై వేసిన చిత్రం.

MISIMI/ మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD-191/20



గాలా-లింకన్ (1976)